# మహి న్యూస్

www.mahinewsindia.com

MAHI NEWS

Epaper: https://epaper.mahinewsindia.com

తెలుగు దినపత్రిక



విలేకరులు కావలెను

మహి న్యూస్

ఆంధ్రప్రదేశ్‌లో వెలువడుతున్న మహి న్యూస్ తెలుగు దినపత్రికకు ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని జిల్లాల వారిగా స్టాఫ్ రిపోర్టర్, నియోజకవర్గ, మండలాల విలేకరులు కావలెను. తెలుగు భాష మీద కనీస అవగాహన కలిగివుండి, వార్తలను రాయగలిగి ఉన్న వారికి, వార్తలను టైపు చేయగలిగి ఉన్న వారికి ప్రాధాన్యత ఇవ్వబడును.

-: సంప్రదించండి :-

9059585898



ఆంధ్రప్రదేశ్,తెలంగాణ. సంపుటి : 02 సంచిక : 199 ఎడిటర్ : నీలి రామసుబ్బయ్య, పేజీలు : 8, వెల రూ. 2 సోమవారం -19 - అక్టోబర్ - 2026

Published From :YSR Kadapa circulated by Kurnool I Anatapuram I Chittoor I East & West Godavari I Guntur I Krishna I Nellore I Srikakulam I Visakhapatnam I Vijayanagaram I Prakasham & Hyderabad & Telangana


## అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయండి: మోదీకి ఖర్గే లేఖ

- కొత్త బిల్లులపై చర్చ పెట్టాలని డిమాండ్
- గతంలో డీలిమిటేషన్ బిల్లు వీగిపోయిన వైనం ప్రస్తావన
- అఖిలపక్షం కోసం విజ్ఞప్తి చేయడం ఇది నాలుగోసారని వెల్లడి
- పార్లమెంట్ సమావేశాలు ప్రొరోగ్ కాకపోవడంపై ఆందోళన




కొత్త బిల్లులు, కీలక ప్రతిపాదనలపై చర్చించేందుకు తక్షణమే అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ అధ్యక్షుడు, రాజ్యసభ ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే ప్రధాని నరేంద్ర మోదీకి లేఖ రాశారు. ఈ ప్రతిపాదనలను పార్లమెంటులో ప్రవేశపెట్టడానికి ముందే వాటిపై సమగ్రంగా చర్చించాల్సిన అవసరం

## ఈవీఎంలు వద్దు, బ్యాలెట్ పేపర్లే కావాలి.. సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌ను తొలగించాలి

- ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణను రద్దు చేయాలని తీర్మానం
- ఎన్నికల అవకతవకలపై రాష్ట్రపతికి ఫిర్యాదుకు నిర్ణయం
- కాంగ్రెస్, టీవీకే పార్టీలది ద్వంద్వ వైఖరి అంటూ డీఎంకే విమర్శలు




డీఎంకే పార్టీ కేంద్ర ఎన్నికల సంఘంపై, ఎన్నికల ప్రక్రియపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌ను తక్షణమే పదవి నుంచి తొలగించాలని, ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల (ఈవీఎం) స్థానంలో తిరిగి బ్యాలెట్ పేపర్ల విధానాన్ని ప్రవేశపెట్టాలని ఆ పార్టీ ఎంపీలు డిమాండ్ చేశారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమాన్ని పూర్తిగా రద్దు చేయాలని కూడా పట్టుబట్టారు. ఈరోజు ఉదయం 11 గంటలకు చెన్నైలోని పార్టీ ప్రధాన కార్యాలయం

## ప్రశాంత్‌భూషణ్ వ్యాఖ్యలపై కాంగ్రెస్ సమాధానం చెప్పాలి



- బంగ్లాదేశ్ తరహాలో మన దేశంలో కూడా అరాచకం సృష్టించి 'పాలన మార్పు' చేస్తామంటూ బహిరంగంగా ప్రకటించిన న్యాయవాది ప్రశాంత్‌భూషణ్ వ్యాఖ్యలపై కాంగ్రెస్ సమాధానం చెప్పాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్‌రావ డిమాండ్ చేశారు.
- 'ఎన్నికల్లో ప్రజాస్వామ్యబద్ధంగా గెలవలేకనే రాహుల్ గాంధీ దేశ వ్యతిరేక శక్తులతో చేతులు కలిపారు.
- ఓవైపు రాజ్యాంగ పుస్తకం చేతపట్టుకొని.. మరోవైపు రాజ్యాంగబద్ధ సంస్థలను నిర్వీర్యం చేసే కుట్ర చేస్తున్నారు.

బంగ్లాదేశ్ తరహాలో మన దేశంలో కూడా అరాచకం సృష్టించి 'పాలన మార్పు' చేస్తామంటూ బహిరంగంగా ప్రకటించిన న్యాయవాది ప్రశాంత్ భూషణ్ వ్యాఖ్యలపై కాంగ్రెస్ సమాధానం చెప్పాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్‌రావు డిమాండ్ చేశారు. 'ఎన్నికల్లో ప్రజాస్వామ్యబద్ధంగా గెలవలేకనే మిగతా 2లో

## కరెంట్, నీళ్లు పొదుపుగా వాడాలి

- విద్యుత్, నీటిని పొదుపుగా వినియోగించాలని ప్రజలకు విజ్ఞప్తి
- రాష్ట్రంలో 20,000 మెగావాట్లకు చేరిన విద్యుత్ డిమాండ్
- గతంలో చలిగా ఉండే అక్టోబర్‌లోనూ ఇప్పుడు ఎండల తీవ్రత
- వాతావరణ మార్పుల వల్లే ఈ పరిస్థితి నెలకొందన్న భట్టి
- రాష్ట్రంలో ఎల్ నినో ప్రభావంతో వాతావరణ పరిస్థితులు ప్రతికూలంగా మారిన నేపథ్యంలో, ప్రజలు విద్యుత్తు, నీటిని అత్యంత పొదుపుగా వినియోగించుకోవాలని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క విజ్ఞప్తి చేశారు.
- మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా సహజ వనరులను బాధ్యతాయుతంగా వినియోగించుకోవాల్సిన అవశ్యకత ఎంతైనా ఉందని ఆయన స్పష్టం చేశారు.
- శనివారం హైదరాబాద్‌లో నిర్వహించిన 'బతుకమ్మ యంగ్ ఫిల్మ్ మేకర్స్ అవార్డ్స్' ప్రదానోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు పురస్కారాలను అందజేశారు.
- రాష్ట్రంలో నెలకొన్న ప్రస్తుత పరిస్థితులపై ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్ సుమారు 20,000 మెగావాట్లకు చేరుకుందని, పెరుగుతున్న ఉష్ణోగ్రతల ప్రభావంతో విద్యుత్ వినియోగం భారీగా పెరిగిందని వివరించారు.

### ఎల్ నినో ప్రభావంపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆందోళన




రాష్ట్రంలో ఎల్ నినో ప్రభావంతో వాతావరణ పరిస్థితులు ప్రతికూలంగా మారిన నేపథ్యంలో, ప్రజలు విద్యుత్తు, నీటిని అత్యంత పొదుపుగా వినియోగించుకోవాలని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క విజ్ఞప్తి చేశారు. మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా సహజ వనరులను బాధ్యతాయుతంగా వినియోగించు కోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని ఆయన స్పష్టం చేశారు. శనివారం హైదరాబాద్‌లో నిర్వహించిన 'బతుకమ్మ యంగ్ ఫిల్మ్ మేకర్స్ అవార్డ్స్' ప్రదానోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు పురస్కారాలను అందజేశారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ, రాష్ట్రంలో నెలకొన్న ప్రస్తుత పరిస్థితులపై ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్ మిగతా 2లో

## ప్రతీకారాలతో రతనాల సీమను రక్తసీమగా మారుస్తున్నాయి



- ఏపీని 'సౌత్ బీహార్'గా మారుస్తున్నారు
- టీడీపీ, వైసీపీలది ప్రతీకార రాజకీయమన్న షర్మిల
- స్థానిక ఎన్నికల్లో హింసపై తీవ్ర స్థాయిలో విమర్శలు
- ఎన్నికల సంఘం, పోలీసుల తీరుపై ప్రశ్నలు
- స్వేచ్ఛాయుత ఎన్నికలకు చర్యలు తీసుకోవాలని డిమాండ్

టీడీపీ, వైసీపీలపై ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల రెడ్డి తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ఈ రెండు పార్టీలు దాష్టీక రాజకీయాలు చేస్తూ, ప్రతీకారాలతో రతనాల సీమను రక్తసీమగా మారుస్తున్నాయని ఆరోపించారు. అన్నపూర్ణ లాంటి ఆంధ్రప్రదేశ్‌ను మరో 'సౌత్ బీహార్'గా మిగతా 2లో

## చంద్రబాబు ఆదేశాలతోనే పోలీసులు కాల్పులు జరిపారు

### వైసీపీ అభ్యర్థులు ఒంటరిగా వెళ్తే కొడుతున్నారు

- ఇష్టారాజ్యంగా కూటమి
- మున్సిపల్ ఎన్నికల నామినేషన్ల సందర్భంగా చోటు చేసుకుంటున్న ఘటనలపై వైసీపీ నేత సజ్జల రామకృష్ణారెడ్డి తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు.
- నామినేషన్ల కేంద్రం వద్దకు వైసీపీ అభ్యర్థులు ఒంటరిగా వెళ్తే కొడుతున్నారని ఆయన ఆరోపించారు.



మున్సిపల్ ఎన్నికల నామినేషన్ల సందర్భంగా చోటు చేసుకుంటున్న ఘటనలపై వైసీపీ నేత సజ్జల రామకృష్ణారెడ్డి తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. నామినేషన్ల కేంద్రం వద్దకు వైసీపీ అభ్యర్థులు ఒంటరిగా వెళ్తే కొడుతున్నారని మిగతా 2లో

## తెలంగాణ నీళ్లను తరలించే కుట్ర..



- చంద్రబాబు ప్లాన్‌కు రేవంత్ సహకారం
- నువ్వు మోటార్లు నడిపి ఉంటే వరంగల్‌కు కరువు ఎక్కడిది.. రేవంత్ రెడ్డిపై హరీశ్ రావు ఫైర్
- తెలంగాణలో కరవు పరిస్థితులకు ప్రభుత్వమే కారణమని ఆరోపణ
- దేవాదులలో 10 మోటార్లకు మూడు మాత్రమే నడుస్తున్నాయని విమర్శ

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు తీవ్ర విమర్శలు చేశారు. మిగతా 2లో

## పక్క రాష్ట్రాల గూండాలతో టీడీపీ శ్రేణులపై గొడ్డలి పార్టీ దాడులు

### ఓటమి భయంతోనే దాడులు

- జగన్ పై మంత్రి సవిత ఫైర్
- వివేకా హత్య కేసులో వేళ్లన్నీ తాడేపల్లి ప్యాలెస్ వైపే...
- ఈడీ దాడులతో జగన్ లో భయాందోళనలు
- వీధి రౌడీలా పెట్రేగిన ఎంపీ మిధున్ రెడ్డి
- గొడ్డలి పార్టీ దౌర్జన్యాలపై ఈసీకి ఫిర్యాదు చేశాం
- వైసీపీ పని క్లోజ్
- పులివెందుల సహా స్థానిక ఎన్నికల్లో కూటమి క్లీన్ స్వీప్

'స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓటమి ఖాయమని తెలిసి జగన్,



గొడ్డలి పార్టీ నాయకులు దాడులకు తెగబడుతున్నారు. పక్కరాష్ట్రాల నుంచి గూండాలను తీసుకొచ్చి, టీడీపీ కార్యకర్తలు, నాయకులపై దాడులకు తెగబడుతున్నారు. ఎంపీ మిథున్ రెడ్డి వీధి రౌడీలా వ్యహరించారు. మిగతా 2లో

## నవంబర్ రెండో వారంలో అందరం కలుద్దాం... గెట్ రెడీ!




- ఏపీలో టీడీపీ, వైసీపీ మధ్య సివిల్ వార్ నడుస్తోందన్న విజయసాయిరెడ్డి
- పుంగనూరు, తాడిపత్రి ఘటనలను ప్రస్తావిస్తూ రెండు కుటుంబాలపై ఫైర్
- 'రెడ్ బుక్ వర్సెస్ రప్ప రప్ప' అంటూ రాష్ట్రంలో క్షీణించిన శాంతిభద్రతలపై ఆందోళన

ఆంధ్రప్రదేశ్ రాజకీయాలపై రాజ్యసభ మాజీ సభ్యుడు విజయసాయిరెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. మిగతా 2లో

## స్థానిక ఎన్నికల్లో కూటమి ఐక్యతే కీలకం

- చంద్రబాబుతో మధ్యప్రదేశ్ సీఎం సమావేశం... జాతీయ రాజకీయాలపై చర్చ
- స్థానిక ఎన్నికల్లో కూటమి ఐక్యతే కీలకం అని సీఎం చంద్రబాబు అన్నారు.
- మున్సిపల్ ఎన్నికల వేళ కూటమి నేతలతో సీఎం సమావేశమయ్యారు.
- ఎన్నికల వ్యూహంపై దిశానిర్దేశం చేశారు. టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు సమన్వయంతో వెళ్లాలని సూచించారు
- నామినేషన్లకు కూటమి నేతలు అభ్యర్థులతో కలిసి వెళ్లాలని చెప్పారు.
- శుక్రవారం జరిగిన ఘటనల దృష్ట్యా అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు.
- అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని అన్నారు.
- స్వర్ణాంధ్ర 2047 లక్ష్య సాధనకు సమిష్టిగా కృషి చేయాలని ఆదేశించారు.
- ఇదిలా ఉంటే స్థానిక ఎన్నికల టికెట్ల కేటాయింపులో చాలా మంది అభ్యర్థులు,కార్యకర్తలు నిరాశ చెందుతున్నారు.

### స్థానిక సంస్థల ఎన్నికలపై మంత్రులు, ఎమ్మెల్యేలతో సీఎం చంద్రబాబు



స్థానిక ఎన్నికల్లో కూటమి ఐక్యతే కీలకం అని సీఎం చంద్రబాబు అన్నారు. మున్సిపల్ ఎన్నికల వేళ కూటమి నేతలతో సీఎం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల వ్యూహంపై దిశానిర్దేశం చేశారు. టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు మిగతా 2లో

## 'ప్రభుత్వం, పోలీసులు, ఎన్నికల సంఘం కుమ్మక్కు'




- పోలీసుల కళ్లెదుటే టీడీపీ గూండాల దాడులు, రౌడీయిజం
- ఎన్నికల అధికారుల చేతుల్లోంచి నామినేషన్ పత్రాలు లాక్కెళ్తున్న వైనం
- వైఎస్సార్సీపీ అభ్యర్థులపై దాడులు చేస్తున్నా పోలీసుల చోద్యం
- వీడియో ఆధారాలతో సహా ఫిర్యాదు చేసినా పట్టించుకోని ఎన్నికల సంఘం
- అరాచకాలను ఆధారాలతో సహా చూపించిన సుధాకర్ బాబు

తాడేపల్లి: పోలీసులు కళ్లెదుటే వైఎస్సార్‌సీపీ అభ్యర్థులపై టీడీపీ గూండాలు దాడులు చేసి మిగతా 2లో

## అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయండి: మోదీకి ఖర్గే లేఖ

ఉందని ఆయన నొక్కిచెప్పారు. ఈ ఏడాది ఏప్రిల్ 17న నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్)కు సంబంధించిన రాజ్యాంగ సవరణ బిల్లు లోక్‌సభలో మూడింట రెండొంతుల మెజారిటీ సాధించలేక వీగిపోయిన విషయాన్ని ఖర్గే తన లేఖలో గుర్తుచేశారు. దేశంపై తీవ్ర ప్రభావం చూపే ఇటువంటి రాజ్యాంగ సవరణ బిల్లులను మరోసారి పార్లమెంటులో ఏకపక్షంగా 'బుల్డోజ్' చేయవద్దని ప్రభుత్వానికి హితవు పలికారు. అఖిలపక్ష సమావేశం కోసం తాను విజ్ఞప్తి చేయడం ఇది నాలుగోసారి అని ఖర్గే తెలిపారు. గతంలో ఏప్రిల్ 11, జులై 16, ఆగస్టు 27 తేదీల్లో కూడా సమావేశం నిర్వహించాలని తాను కోరినట్లు ఆయన పేర్కొన్నారు. మరోవైపు, ఆగస్టు 13న వర్షాకాల సమావేశాలు వాయిదా పడిన 64 రోజుల తర్వాత కూడా ఉభయ సభలను ఇంకా ప్రొరోగ్ చేయలేదని, గతంలో ఎన్నడూ ఇలా జరగలేదని అని ఖర్గే ఆందోళన వ్యక్తం చేశారు. కాగా, 2026 ఏప్రిల్ 16న కేంద్ర న్యాయశాఖ సహాయ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ ప్రవేశపెట్టిన రాజ్యాంగ (131వ సవరణ) బిల్లుతో పాటు మరో రెండు బిల్లులు మరుసటి రోజే తిరస్కరణకు గురైన సంగతి తెలిసిందే.

## ఈవీఎంలు వద్దు, బ్యాలెట్ పేపర్లే కావాలి.. సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌ను తొలగించాలి

అన్నా అరివాలయంలో డీఎంకే అధినేత, తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ అధ్యక్షతన పార్టీ పార్లమెంటరీ సభ్యుల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో మొత్తం నాలుగు కీలక తీర్మానాలను ఆమోదించారు. వీటిలో ప్రధానంగా ఎన్నికల ప్రక్రియలో అవకతవకలు జరుగుతున్నాయని, వాటిని సరిదిద్దేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతూ భారత రాష్ట్రపతికి వినతిపత్రం సమర్పించాలని నిర్ణయించారు.

ఆమోదించిన తీర్మానాల్లో మొదటిది.. సీఈసీ జ్ఞానేశ్ కుమార్ తొలగింపు గురించే ఉంది. ఎన్నికల నిర్వహణలో ఆయన వైఫల్యం చెందారని ఆరోపిస్తూ ఈ డిమాండ్ చేశారు. అయితే, ఏ కారణాలతో ఆయన్ను తొలగించాలని కోరుతున్నారో లేదా ఎలాంటి నిర్దిష్ట అవకతవకలు జరిగాయో పార్టీ విడుదల చేసిన ప్రకటనలో స్పష్టంగా పేర్కొనలేదు. ఈ అంశాలపై రాష్ట్రపతికి సమర్పించే వినతిపత్రంలో పూర్తి వివరాలు పొందుపరచనున్నట్లు తెలుస్తోంది.

రెండో తీర్మానంలో.. విద్యార్థి సంఘాలు నిర్వహిస్తున్న నిరసనలకు డీఎంకే తన మద్దతు ప్రకటించింది. అయితే, ఏ విద్యార్థి సంఘాలు, ఏ డిమాండ్లతో ఆందోళనలు చేస్తున్నాయో ఆ తీర్మానంలో వెల్లడించలేదు.

ఇక మూడో తీర్మానంలో.. కాంగ్రెస్, అధికార తమిళగ వెట్రి కళగం (టీవీకే) పార్టీల ద్వంద్వ వైఖరిని డీఎంకే ఖండించింది. ఏయే అంశాల్లో ఈ పార్టీలు ద్వంద్వ ప్రమాణాలు పాటిస్తున్నాయో కూడా ప్రకటనలో వివరించలేదు.

నాలుగో తీర్మానం ద్వారా తమ డిమాండ్లను రాష్ట్రపతి దృష్టికి తీసుకెళ్లి, ఎన్నికల ప్రక్రియలో సంస్కరణలు తీసుకురావాలని కోరాలని పునరుద్ఘాటించారు. ఈ నిర్ణయాలతో డీఎంకే ఎన్నికల సంఘంపై ప్రత్యక్ష పోరాటానికి సిద్ధమైనట్లు స్పష్టమవుతోంది.

## ప్రశాంత్‌భూషణ్ వ్యాఖ్యలపై కాంగ్రెస్ సమాధానం చెప్పాలి

రాహుల్ గాంధీ దేశ వ్యతిరేక శక్తులతో చేతులు కలిపారు. ఓవైపు రాజ్యాంగ పుస్తకం చేతపట్టుకొని.. మరోవైపు రాజ్యాంగబద్ధ సంస్థలను నిర్వీర్యం చేసే కుట్ర చేస్తున్నారు. ప్రశాంత్ భూషణ్, సీజేపీ నేతల వ్యాఖ్యలపై కాంగ్రెస్ వైఖరి ఏమిటి? గతంలో కశ్మీర్ సహా పలు జాతీయ అంశాలపై నిరంతరం దేశ వ్యతిరేక వైఖరిని ప్రదర్శించిన న్యాయవాది ప్రశాంత్ భూషణ్, సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ విద్యార్థి విభాగమైన ఆల్ ఇండియా స్టూడెంట్స్ అసోసియేషన్ అధ్యక్షురాలు నేహా బోరా, కాక్రోచ్ జనతా పార్టీ నేత అభిజీత్ దీప్కే తదితరులు చేసిన వ్యాఖ్యలు తీవ్ర అభ్యంతరకరం. ముమ్మాటికీ దేశద్రోహమే' అని ఆయన స్పష్టం చేశారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో రాంచందర్‌రావు మీడియాతో మాట్లాడారు. 'భారతదేశం ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశం.. ఇక్కడ రాజ్యాంగబద్ధంగా ఎన్నికలు జరగడం, ప్రజాతీర్పు మేరకు ఒక కూటమి గెలవడం, మరొకటి ఓడిపోవడం నిరంతర ప్రజాస్వామ్య ప్రక్రియ. అయితే బంగ్లాదేశ్ తరహా విధ్వంసాన్ని, హింసను ప్రేరణగా తీసుకుని దేశ పాలనలో మార్పు తెస్తామంటూ విద్రోహ శక్తులు ప్రకటించడాన్ని కాంగ్రెస్ పార్టీ సమర్థిస్తుందా? దేశ వ్యాప్తంగా ఇలాంటి దేశ వ్యతిరేక నినాదాలు, కుట్రలు జరుగుతుంటే కాంగ్రెస్ పార్టీ ఎందుకు మౌనం వహిస్తోంది?' అని నిలదీశారు. 'దేశ ప్రజలకు అత్యంత నమ్మకమైన ప్రజాస్వామ్య వ్యవస్థలు, న్యాయవ్యవస్థ, కేంద్ర ఎన్నికల సంఘం(ఈసీఐ) వంటి సర్వోన్నత సంస్థలను నిర్వీర్యం చేసేందుకు రాహుల్ గాంధీ, అర్బన్ నక్సలైట్లు పక్కా వ్యూహంతో పనిచేస్తున్నా'రని ఆరోపించారు. వారి పోరాటం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ఆర్ఎ?సఎస్ లేదా ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్‌లకు వ్యతిరేకంగా కాదని పేర్కొంటూ, అడ్డదారిలో అధికారాన్ని చేజిక్కించుకోవడమే వారి లక్ష్యమని రాంచందర్‌రావు మండిపడ్డారు.

## ప్రతీకారాలతో రతనాల సీమను రక్తసీమగా మారుస్తున్నాయి

మార్చే పరిస్థితులు సృష్టిస్తున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల వేళ రాష్ట్రంలో చోటుచేసుకుంటున్న హింసాత్మక ఘటనలపై సోషల్ మీడియా వేదికగా ఆమె స్పందించారు. స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా రాయచోటి, పుంగనూరులో జరిగిన ఘర్షణలు రాష్ట్ర ఎన్నికల చరిత్రలో ఆందోళనకరమైన పరిణామాలని షర్మిల అన్నారు. ప్రశాంతంగా జరగాల్సిన ఎన్నికలను ఘర్షణలు, దాడులతో రణరంగంగా మారుస్తున్నారని విమర్శించారు. "కూటమిది నిజంగా పవిత్ర పాలనే అయితే దాడులు ఎందుకు? బలవంతపు ఏకగ్రీవాలు ఎందుకు? నామినేషన్లు వేయకుండా అడ్డుకోవడమెందుకు?" అని ఆమె ప్రభుత్వాన్ని సూటిగా ప్రశ్నించారు. నాడు వైసీపీ హయాంలో హింసాకాండ జరిగితే, నేడు టీడీపీ హయాంలో అంతకుమించిన ఘోరాలు జరుగుతున్నాయని ఆమె పోల్చారు. నామినేషన్ కేంద్రాల వద్ద గూండాలు స్వైరవిహారం చేస్తుంటే ఎన్నికల సంఘం ఏం చేస్తోందని, శాంతిభద్రతలు కాపాడాల్సిన పోలీసులు ఎందుకు విఫలమవుతున్నారని షర్మిల నిలదీశారు. అధికారాన్ని అడ్డుపెట్టుకుని టీడీపీ సాగిస్తున్న ఈ దౌర్జన్య వైఖరిని కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తోందని స్పష్టం చేశారు. ప్రజాస్వామ్యంలో కక్ష సాధింపు రాజకీయాలకు, రక్తపాతానికి తావులేదని, అభివృద్ధి కోసం పోటీ పడాలి కానీ భౌతిక దాడులకు పాల్పడటం సరికాదని హితవు పలికారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఎన్నికల సంఘానికి ఆమె పలు డిమాండ్లు చేశారు. స్థానిక ఎన్నికలను స్వేచ్ఛగా, ప్రశాంతంగా నిర్వహించాలని, ప్రతి నామినేషన్ కేంద్రం వద్ద పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేయాలని కోరారు. అర్హులైన ప్రతి ఒక్కరూ నామినేషన్ వేసేలా చూడాలని, బలవంతపు ఏకగ్రీవాలను అడ్డుకోవాలని సూచించారు. ఎన్నికలు ప్రజాస్వామ్యానికి పండుగ కావాలి కానీ, పగలు ప్రతీకారాలకు వేదిక కాకూడదని ఆమె పేర్కొన్నారు.

## నవంబర్ రెండో వారంలో అందరం కలుద్దాం... గెట్ రెడీ!

రాష్ట్రంలో టీడీపీ, వైసీపీల మధ్య పౌర యుద్ధం (సివిల్ వార్) నడుస్తోందని, రెండు కుటుంబాలు పోషిస్తున్న ఫ్యాక్షన్ల మధ్య ఘర్షణలు జరుగుతున్నాయని ఆరోపిస్తూ సోషల్ మీడియాలో ఒక పోస్ట్ పెట్టారు. గత రెండు రోజులుగా పుంగనూరు, రాయచోటి, తాడిపత్రి, ఆళ్లగడ్డ వంటి పట్టణాల్లో జరుగుతున్న హింసాత్మక ఘటనలను విజయసాయిరెడ్డి తన పోస్టులో ప్రస్తావించారు. "రెడ్ బుక్ వర్సెస్ రప్ప రప్ప రాజకీయం నడుస్తోంది. చంద్రబాబు, జగన్ కుటుంబాల మధ్య, ఆ రెండు కుల, మైనారిటీ కుటుంబాలు పోషిస్తున్న ఫ్యాక్షన్ల మధ్య ఓ సివిల్ వార్ నడుస్తోంది" అని ఆయన ఘాటుగా వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు ఎంత దారుణంగా ఉన్నాయో ఈ ఘటనలే నిదర్శనమని అన్నారు. కర్రలు, కత్తులు, గూండాలు, బౌన్సర్లు, నామినేషన్లు చించివేయడం, జీపులతో ఢీకొట్టడం, నెత్తురోడేలా దాడులు చేసుకోవడం వంటి దృశ్యాలు దేశవ్యాప్తంగా రాష్ట్ర పరువును తీస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇదే అరాచకం కొనసాగితే, 2029 నాటి సాధారణ ఎన్నికల్లో ఈ పార్టీలు నేరుగా బందిపోట్లకు, హత్యలు, మానభంగాలు, దొంగతనాల చరిత్ర ఉన్నవారికే టికెట్లు ఇచ్చే పరిస్థితి వస్తుందని ఆయన జోస్యం చెప్పారు. ఈ రెండు పార్టీలకు గుణపాఠం చెప్పాల్సిన సమయం ఆసన్నమైందని, ఒక మూడో ప్రత్యామ్నాయంతో సరికొత్త రాజకీయానికి యువత (జెన్-జీ) నడుం బిగించాలని పిలుపునిచ్చారు. "ఈ అరాచకం ఇకమీదటా కొనసాగాలా? లేక, ఈ రెండు పార్టీలకు గుణపాఠం నేర్పాలా? అన్నది నిర్ణయించుకోవాలి. నవంబర్ రెండో వారంలో అందరం కలుద్దాం... గెట్ రెడీ!" అంటూ తన పోస్టును ముగించారు.

## 'ప్రభుత్వం, పోలీసులు, ఎన్నికల సంఘం కుమ్మక్కు'

నామినేషన్ పత్రాలు లాక్కుని చింపుతుంటే, ఎన్నికల అధికారుల చేతుల్లోంచి పేపర్లు లాక్కుని పోతున్న పరిస్థితులు చూస్తుంటే.. అసలు రాష్ట్రంలో ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో ఎన్నికలు జరుగుతున్నాయా లేక చంద్రబాబు నాయుడు డైరెక్షన్‌లో జరుగుతున్నాయా అనే అనుమానం కలుగుతోందని వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు టీజేఆర్ సుధాకర్ బాబు తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కేంద్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ అభ్యర్థులతో కలిసి వైఎస్సార్‌సీపీ ఎంపీలు స్వయంగా రిటర్నింగ్ అధికారులకు నామినేషన్ పత్రాలు ఇస్తున్నప్పటికీ, ఎన్నికల అధికారులు వాటిని స్వీకరించకుండా కావాలనే కాలయాపన చేస్తూ, టీడీపీ నాయకుల ఆదేశాల మేరకు వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ప్రభుత్వ అండతో పోలీసు శాఖ పూర్తిగా పచ్చ కండువా కప్పుకుని, ఎన్నికల నిబంధనలను తుంగలో తొక్కి అధికార పార్టీకి వంత పాడుతుండటం ఈ కుమ్మక్కు రాజకీయాలకు నిలువెత్తు నిదర్శనం అన్నారు. తిరుపతి, కడప, రాయచోటి, పొన్నూరు, ధర్మవరం, పులివెందుల తదితర ప్రాంతాలలోవైఎస్సార్‌సీపీ నాయకులు, అభ్యర్థులపై కత్తులు, కర్రలు, రాళ్లతో దాడి చేసి రక్తపాతం సృష్టిస్తున్నారని మండిపడ్డారు. వైఎస్సార్‌సీపీ లోక్‌సభాపక్ష నేత మిథున్ రెడ్డి కాన్వాయ్‌పై, ఆయన సెక్యూరిటీ సిబ్బందిపై దాడులే ఇందుకు నిదర్శనమన్నారు. వైఎస్సార్సీపీ నాయకులను అక్రమంగా అర్ధరాత్రి హౌస్ అరెస్టులు చేయడం, పిడి యాక్టు బనాయించడం, పాత కేసులపై బైండోవర్లు చేయడం ద్వారా పోలీసు వ్యవస్థ పూర్తిగా టీడీపీకి తొత్తుగా మారిందని విమర్శించారు. నిష్పక్షపాతంగా స్వేచ్ఛా వాతావరణంలో ఎన్నికలు జరిగితే గెలిచే పరిస్థితి ఉండదనే భయంతోనే చంద్రబాబు రక్తపాతం సృష్టిస్తున్నారని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఈరోజు ఆంధ్రప్రదేశ్‌లో ప్రజాస్వామ్యానికి, చట్టానికి, ఎన్నికల వ్యవస్థకు తీవ్ర పరీక్ష ఎదురవుతోంది. చంద్రబాబు నాయుడు రెండున్నరేళ్ల పాలనపై ప్రజల్లో వ్యతిరేకత ఉందనే భయంతోనే స్థానిక ఎన్నికల ప్రక్రియను అడ్డుకోవడానికి దాడులు, దౌర్జన్యాలకు తెరలేపాడు. పోలీసులను అడ్డం పెట్టుకునివైఎస్సార్‌సీపీ నాయకులను, కార్యకర్తలను భయభ్రాంతులకు గురిచేస్తున్నాడు.

# కరెంట్, నీళ్లు పొదుపుగా వాడాలి

సుమారు 20,000 మెగావాట్లకు చేరుకుందని, పెరుగుతున్న ఉష్ణోగ్రతల ప్రభావంతో విద్యుత్ వినియోగం భారీగా పెరిగిందని వివరించారు. గతంలో అక్టోబర్, నవంబర్ నెలల్లో చలి తీవ్రత అధికంగా ఉండేదని, అయితే ప్రస్తుతం వాతావరణ మార్పుల వల్ల పరిస్థితులు పూర్తిగా భిన్నంగా మారాయని ఆయన పేర్కొన్నారు. "ఒకప్పుడు చలి నుంచి రక్షణ పొందేందుకు ప్రయత్నించేవాళ్లం, కానీ నేడు ఎండల తీవ్రత నుంచి మనల్ని మనం కాపాడుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది" అని వ్యాఖ్యానించారు. వాతావరణంలో సంభవిస్తున్న ఈ అనూహ్య మార్పులే విద్యుత్, నీటి కొరతకు దారితీస్తున్నాయని అభిప్రాయపడ్డారు. ప్రతి ఒక్కరూ సహజ వనరుల విలువను గుర్తించి, వాటిని పొదుపుగా వినియోగించాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. విశ్వవిద్యాలయాలు, ఉన్నత విద్యాసంస్థల్లో విద్యార్థుల హక్కుల పరిరక్షణ, కులం, సామాజిక నేపథ్యం ఆధారంగా వివక్షను నిరోధించేలా ప్రతిపాదిత 'రోహిత్ వేముల తెలంగాణ బిల్లు' ముసాయిదాను మూడు నెలల్లో సిద్ధం చేయాలని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. ప్రాథమిక ముసాయిదాను సీనియర్ సివిల్ సర్వెంట్ల కమిటీ (సీఎస్‌సీ)కి సమర్పించాలని సూచించారు. తెలంగాణ సచివాలయంలో శుక్రవారం భట్టి విక్రమార్క అధ్యక్షతన బిల్లుపై క్యాబినెట్ సబ్ కమిటీ రెండో సమావేశం జరిగింది. బిల్లు రూపకల్పన విధానం, కమిటీ ఏర్పాటు, న్యాయపరమైన అంశాలు, వివిధ వర్గాలతో సంప్రదింపులపై చర్చించారు. విద్యార్థులు, అధ్యాపకులు, న్యాయ నిపుణులు, పౌర సమాజ సంస్థలు, విద్యారంగ నిపుణుల అభిప్రాయాలను సేకరించి ముసాయిదా రూపొందించాలని ఉప ముఖ్యమంత్రి సూచించారు. బిల్లు రూపకల్పనకు షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ నాయకత్వం వహించాలని, న్యాయశాఖను కమిటీలో సభ్య శాఖగా చేర్చాలని ఆదేశించారు. విద్యాశాఖ, హోంశాఖ, యూజీసీ తదితర సంస్థల భాగస్వామ్యంపైనా పరిశీలన జరపాలని చెప్పారు. ముసాయిదా తయారీలో న్యాయపరమైన, సాంకేతిక అంశాల కోసం నల్సార్ న్యాయ విశ్వవిద్యాలయం సహకారం తీసుకోవాలని సమావేశంలో నిర్ణయించారు. విద్యార్థులకు సమాన అవకాశాలు కల్పించడం, వివక్షను నిరోధించడం, విద్యాసంస్థల్లో న్యాయబద్ధమైన వాతావరణాన్ని బలోపేతం చేయడంపై చట్టంలో దృష్టి సారించనున్నారు. సమావేశంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌తో పాటు ప్రభుత్వ ఉన్నతాధికారులు, న్యాయవాది దిశా వడేకర్ తదితరులు పాల్గొన్నారు. తెలంగాణను ప్రపంచ పెట్టుబడులకు గమ్యస్థానంగా మార్చడమే తమ లక్ష్యమని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. హైదరాబాద్ కేంద్రంగా ఐటీ, ఫార్మా, ఏఐ నుంచి తయారీ రంగం వరకు.. అలాగే పల్లె నుంచి పట్నం వరకు ఆర్థికాభివృద్ధి చేసేందుకు నూతన ప్రణాళికతో ముందుకెళ్తున్నామన్నారు. సమాఖ్య చాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో గురువారం హైటెక్స్‌లో గ్లోబల్ బిజినెస్ సమ్మిట్ ముగింపు కార్యక్రమంలో డిప్యూటీ సీఎం భట్టి పాల్గొన్నారు. తెలంగాణలో పెట్టుబడులు పెట్టాలని తెలుగు పారిశ్రామిక వేత్తలను ఆహ్వానించారు. పరిశ్రమలకు అవసరమైన భూమి, విద్యుత్, నీరు సహా అనుమతులన్నీ కల్పిస్తామని, పెట్టుబడిదారులకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. సీఎం రేవంత్‌రెడ్డి, ఐటీ, పరిశ్రమల మంత్రి శ్రీధర్ బాబు సహా సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేస్తాయని తెలిపారు. కాగా వికసిత భారత్ -2047 లక్ష్యసాధనలో పారిశ్రామికవేత్తల పాత్ర కీలకమని కేంద్ర మంత్రి భగీరథ్ చౌదరి అన్నారు. మహిళాసాధికారతకు కేంద్రం ప్రాధాన్యం ఇస్తోందన్నారు. కొత్త తరాన్ని పారిశ్రామికవేత్తలుగా ప్రోత్సహించాలని కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మ పేర్కొన్నారు. హ్యుందాయ్ ప్రతిపాదనలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సానుకూలంగా స్పందించారు. ఆర్ అండ్ డీ కేంద్రం ఏర్పాటుకు అవసరమైన అనుమతులను వెంటనే జారీ చేయాలని అధికారులను ఆదేశించారు. ఇదే క్రమంలో, తెలంగాణలో కార్ల తయారీ ప్లాంట్‌ను కూడా ఏర్పాటు చేయాలని హ్యుందాయ్ ప్రతినిధులను ఆయన ఆహ్వానించారు. రాష్ట్రంలో పరిశ్రమల స్థాపనకు అత్యంత అనుకూల వాతావరణం ఉందని, ప్రభుత్వ పరంగా అన్ని రకాల సహకారం అందిస్తామని ముఖ్యమంత్రి వారికి హామీ ఇచ్చారు. ఈ భారీ పెట్టుబడితో జహీరాబాద్ ప్రాంతం ఆటోమొబైల్ హబ్‌గా మరింత అభివృద్ధి చెందనుండటంతో పాటు, స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు గణనీయంగా మెరుగుపడతాయని ప్రభుత్వం భావిస్తోంది. తెలంగాణలో పారిశ్రామిక రంగానికి మరో భారీ ఊరట లభించింది.

# స్థానిక ఎన్నికల్లో కూటమి ఐక్యతే కీలకం

సమన్వయంతో వెళ్లాలని సూచించారు. నామినేషన్లకు కూటమి నేతలు అభ్యర్థులతో కలిసి వెళ్లాలని చెప్పారు. శుక్రవారం జరిగిన ఘటనల దృష్ట్యా అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని అన్నారు. స్వర్ణాంధ్ర 2047 లక్ష్య సాధనకు సమిష్టిగా కృషి చేయాలని ఆదేశించారు. ఇదిలా ఉంటే స్థానిక ఎన్నికల టికెట్ల కేటాయింపులో చాలా మంది అభ్యర్థులు, కార్యకర్తలు నిరాశ చెందుతున్నారు. కూటమి పొత్తులో భాగంగా మూడు పార్టీలలో ఒకరికి టికెట్ కేటయించడం వల్ల మిగితా వాళ్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని చోట్ల రెబల్స్ గా బరిలో దిగుతున్నారు. ముఖ్యంగా జనసేనలో కార్యకర్తలు, పోటీకి సిద్ధమైన అభ్యర్థులు టికెట్లు దక్కకపోవడంతో తీవ్ర నిరాశ చెందుతూ బహిరంగంగానే విమర్శలు చేస్తున్నారు. టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. సోషల్ రీ ఇంజినీరింగ్ ద్వారా అన్ని వర్గాలకూ సమాన అవకాశాలు కల్పించామన్నారు. క్షేత్రస్థాయిలో కూటమి నేతలు మిత్రధర్మం పాటిస్తూ కలుపుకొని వెళ్లాలని సూచించారు. తెదేపా నుంచి పోటీ చేసే 11 మేయర్ స్థానాలను 11 సామాజిక వర్గాలకు కేటాయించామన్నారు. 2024 ఎన్నికల ఫలితాలకు మించిన స్థాయిలో ఓట్ల శాతం పెరగాలని చెప్పారు. క్షేత్ర స్థాయిలో పర్యటించి ఫలితాలు సాధించాల్సిందేనని పార్టీ నేతలకు దిశానిర్దేశం చేశారు. పంచాయతీ, ఎంపీటీసీ, జడ్పీటీసీ, మున్సిపల్ ఎన్నికల్లో కూటమి అభ్యర్థులు గెలవాల్సిందేనన్నారు. ప్రజాభిప్రాయం, కేడర్ అభిప్రాయాలు పరిగణనలోకి తీసుకొని అభ్యర్థుల ఎంపిక చేపట్టాం. పలు చోట్ల సమస్యలను సామరస్య పూర్వకంగా పరిష్కరించుకోవాలి. స్థానిక సంస్థల ఎన్నికల్లో శాంతిభద్రతలకు భంగం కలిగించేలా వైకాపా వ్యవహరిస్తోంది. గొడ్డలి పార్టీ చర్యలను గమనిస్తూ ప్రభుత్వ యంత్రాంగాన్ని అప్రమత్తం చేయాలి. ఆ పార్టీ కుట్రలను సమర్థంగా తిప్పికొట్టాలి" అని చంద్రబాబు దిశానిర్దేశం చేశారు.

అమరావతి ఉండవల్లి లో సీఎం చంద్రబాబు నివాసంలో ఆయనను మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి మోహన్ యాదవ్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఇరు రాష్ట్రాల మధ్య సత్సంబంధాలు, పరస్పర సహకారంపై చర్చించారు. అమరావతి నగర నిర్మాణ తీరు, భవిష్యత్ రాజధాని అభివృద్ధి ప్రణాళికలు, అత్యాధునిక మౌలిక వసతుల కల్పనపై మోహన్ యాదవ్‌కు చంద్రబాబు వివరించారు. అమరావతి బ్లూప్రింట్, ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణం, ప్రజా రాజధానిగా ఈ ప్రాంతాన్ని తీర్చిదిద్దుతున్న విధానాన్ని ఆయనకు విశదీకరించారు. ఈ సమావేశంలో ప్రాంతీయ అభివృద్ధి మాత్రమే కాకుండా, ఏపీ, మధ్యప్రదేశ్ రాష్ట్రాల మధ్య పారిశ్రామిక, సాంస్కృతిక, ఆర్థికాభివృద్ధి అంశాలపై కూడా విస్తృతంగా చర్చించారు. అలాగే, దేశంలోని ప్రస్తుత రాజకీయ పరిణామాలు, జాతీయ రాజకీయాలపై కూడా ఇరువురు ముఖ్యమంత్రులు తమ అభిప్రాయాలను పంచుకున్నారుపవన్ కల్యాణ్ అనారు. తెలంగాణ యువత ఆశించింది జనసేన సాధిస్తుందని అనారు. ఖమ్మం, నల్గొండ, వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎనికల్లో ప్రచారానికి ఉపయోగించే "జనసేన గ్రాడ్యుయేట్ ఎక్స్‌ప్రెస్" ప్రచారం రథంను పవన్ కళ్యాణ్ ఇవాళ ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీ పవన్ కళ్యాణ్ గారు మాట్లాడుతూ.. ఖమ్మం, నల్గొండ, వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీగా జనసేన పార్టీ అభ్యర్థి డాక్టర్ గడల శ్రీనివాసరావును గెలిపించాలని పట్టభద్రులను కోరారు. తానెప్పుడూ ప్రజల పక్షానే నిలబడ్డానని, తెలంగాణలో జనసేన పార్టీకి ఒక్క అవకాశం ఇవ్వాలని మొట్టమొదటి సారిగా చేతులెత్తి అడుగుతునానని అనారు. జనసేన పార్టీని తెలంగాణలోనే స్థాపించినట్లు పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ద్వారా మొట్టమొదటి సారి తెలంగాణ రాష్ట్రానికి సేవ చూసుకునే అవకాశం, అదృష్టం లభిస్తోందని అనారు. గడల శ్రీనివాసరావుకు ఒక అవకాశం ఇవ్వాలని కోరారు. కొత్త తరం యువత భవిష్యత్తు కోసం, వారి యొక్క రాజకీయ ఆకాంక్షల కోసం డాక్టర్ గడల శ్రీనివాసరావు ప్రచార రథం ద్వారా ప్రజల్లోకి వస్తునట్లు చెప్పారు. 120 రోజుల పాటు ప్రచార రథం ద్వారా ప్రజల్లో తిరుగుతారని, మన తెలంగాణ కోసం ప్రతి ఒక్క పట్టభద్రులు ఈ ప్రచార రథం ఆవశ్యకతను గుర్తించాలని, ప్రచార రథంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పట్టభద్రుల కుర్చీలో కూర్చుని, మీ యొక్క సమస్యలు, ఆలోచనలను పంచుకుని, ఆకాంక్షలను, ఆశయాలను తెలియజేసి మద్దతుగా నిలవాలని పిలుపునిచ్చారు. ఆదిలాబాద్ జిల్లాలో ఒక లక్ష రూపాయలు కూడా చేతిలో లేకుండా బోర్ వెల్ వేయించిన సందర్భంలో ఆ రోజు ఏర్పడిన ఆకాంక్ష ఈ రోజు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 30 వేల కోట్ల రూపాయలతో జల్ జీవన్ ధార పథకం చేపట్టే స్థాయికి వెళ్ళిందని పవన్ కళ్యాణ్ వెల్లడించారు. ఖమ్మం, నల్గొండ, వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎనికల ప్రచారానికి జనసేన సిద్ధమైంది. ఈ ఎనికల కోసం ప్రత్యేకంగా రూపొందించిన 'జనసేన గ్రాడ్యుయేట్ ఎక్స్‌ప్రెస్' ప్రచార రథాని పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ శుక్రవారం హైదరాబాదులో ప్రారంభించారు. ఈ సందర్భంగా వరంగల్, ఖమ్మం, నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గ జనసేన అభ్యర్థిగా బరిలో ఉన డాక్టర్ గడల శ్రీనివాసరావుకు పవన్ కళ్యాణ్ శుభాకాంక్షలు తెలిపారు. ప్రచారానికి సంబంధించి ఆయనకు పలు సూచనలు చేశారు. ఈ 'గ్రాడ్యుయేట్ ఎక్స్‌ప్రెస్' కేవలం ఎనికల ప్రచార వాహనంగానే పరిమితం కాకూడదని పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు. యువత ఎదుర్కొంటున సమస్యలను నిరంతరం తెలుసుకుంటూ, వాటి పరిష్కారానికి కృషి చేసే ఒక ప్రజాసేవా వేదికగా ఇది కొనసాగాలని ఆయన ఆకాంక్షించారు.

# చంద్రబాబు ఆదేశాలతోనే పోలీసులు కాల్పులు జరిపారు

ఆయన ఆరోపించారు. దాడులు చేస్తున్న వారిని వదిలిపెట్టి.. తమ పార్టీ నేతలపై కేసులు పెడుతున్నారని సజ్జల మండిపడ్డారు. టీడీపీ నేతలు, కార్యకర్తలకు పోలీసులు అనుకూలంగా పని చేస్తున్నారని, వైసీపీ వారిని మాత్రం తరిమి కొడుతున్నారని వ్యాఖ్యానించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి పార్టీ కుట్రపూరితంగా వ్యవహరిస్తోందని సజ్జల ఆగ్రహం వ్యక్తం చేశారు. రిజర్వేషన్లు మొదలుకుని నామినేషన్ల వేసే దాకా అంతా కూటమి ఇష్టారాజ్యంగా సాగుతోందని సజ్జల ధ్వజమెత్తారు. ప్రతి పక్షానికి అవకాశం ఇవ్వలేదని మండిపడ్డారు. అధికార పార్టీ అనుకున్నట్లే నామినేషన్ల జరగాలన్నట్టుగా కుట్ర పన్నుతున్నారని ఆరోపించారు. వైసీపీ వారి నామినేషన్లను కావాలనే అడ్డుకుంటున్నారని, అధికార పార్టీ సృష్టిస్తున్న అరాచకాలను రాష్ట్ర ప్రజలు గమనిస్తున్నారని వ్యాఖ్యానించారు. ఎన్నికలు ఫెయిర్ గా జరిగే పరిస్థితిలేదని, పోలీసులు అధికార పార్టీకి వత్తాసు పలుకుతున్నారని సజ్జల ఆరోపించారు. వైసీపీ అభ్యర్థులు గంటల తరబడి క్యూ లైన్లలో వేచి ఉన్నా నామినేసన్లు తీసుకోవడంలేదని, కూటమి పథకమేంటో తిరుపతి, రాయచోటి, పుంగనూరు, కడప, పులివెందులలో జరుగుతున్న ఘటనలు చూస్తుంటే అర్థమవుతోందని సజ్జల రామకృష్ణారెడ్డి విమర్శించారు. నామినేషన్ల ప్రక్రియలో అరాచకాలకు పాల్పడుతున్నారని వైఎస్సార్‌సీపీ స్టేట్ కోఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి మండిపడ్డారు. స్వేచ్ఛగా నామినేషన్లు వేసే వాతావరణం లేదని తెలిపారు. అన్ని చోట్ల టీడీపీ గూండాలు బరితెగిస్తున్నారని, ప్రస్తుత పరిస్థితి చూస్తుంటే తనకు అసలు ఎన్నికలు ఎందుకు అనిపిస్తోందని చెప్పారు. చంద్రబాబు ఆదేశాలతోనే పోలీసులు కాల్పులు జరిపారని ఆరోపించారు. పోలీసులే దాడులు చేస్తున్నారని, దీనికి ఎన్నికలు ఎందుకుని ప్రశ్నించారు. టీడీపీకి ఎన్నికలంటే భయమని తెలిపారు. ఏపీలో భయానక పరిస్థితులు కనిపిస్తున్నాయని సజ్జల రామకృష్ణారెడ్డి అన్నారు. కూటమి ప్రభుత్వం ఆర్గనైజ??డ్ క్రైమ్‌కు పాల్పడుతోందని తెలిపారు. నామినేషన్ల ప్రక్రియలో అరాచకాలకు పాల్పడుతున్నారని సజ్జల రామకృష్ణారెడ్డి అన్నారు. అన్ని చోట్ల టీడీపీ గూండాలు బరి తెగిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కొన్ని చోటల అధికారులు నామినేషన్ల పత్రాలు తీసుకోవడం లేదు. పుంగనూరు, రాయచోటిలో అరాచకాలకు పాల్పడ్డారు. స్థానిక సంస్థల ఎన్నికలు పారదర్శకంగా జరిగే పరిస్థితి లేదని చెప్పారు. నాయకులను అడ్డుకుంటునారని మండిపడ్డారు. రాష్ట్రంలో 'జంగిల్ రాజ్' నడుస్తోందని, చంద్రబాబుకు హింస కొత్తేమీ కాదని జగన్ విమర్శించారు. పార్టీ లోక్‌సభాపక్ష నేతకు కూడా రక్షణ కల్పించలేని దుస్థితి నెలకొందనారు. ఓటమి భయంతోనే అధికార కూటమి దాడులకు దిగుతోందని, స్వేచ్ఛగా ఎనికలు జరిపే ఉద్దేశం వారికి లేదని ఆరోపించారు. కేంద్ర బలగాల పర్యవేక్షణలోనే ఎనికలు సజావుగా సాధ్యమవుతాయని జగన్ స్పష్టం చేశారు. మరోవైపు, మిథున్ రెడ్డితో జగన్ ఫోన్‌లో మాట్లాడి పరామర్శించారు. పుంగనూరులో మిథున్ రెడ్డి కాన్వాయ్‌ను టీడీపీ కార్యకర్తలు అడ్డుకుని రాళ్లు, కర్రలతో దాడికి పాల్పడ్డారని వైసీపీ వర్గాలు తెలిపాయి. ఈ ఘటనలో పలు వాహనాలు ధ్వంసం అయ్యాయని, మిథున్ రెడ్డి భద్రతా సిబ్బందికి గాయాలైనట్టు వైసీపీ వర్గాలు ఆరోపించాయి. అనంతరం అధికారులు ఆయను నామినేషన్ కేంద్రంలోని ఒక ప్రత్యేక గదికి తరలించారు. ఈ దాడి సమయంలో పోలీసులు ప్రేక్షకపాత్ర వహించారని వైసీపీ ఆరోపించింది.

# పక్క రాష్ట్రాల గూండాలతో టీడీపీ శ్రేణులపై గొడ్డలి పార్టీ దాడులు

గొడ్డలి పార్టీ నాయకులు ఎన్ని బెదిరింపులకు, దాడులకు పాల్పడినా భయపడేది లేదు... పులివెందుల సహా స్థానిక సంస్థల ఎన్నికల్లో స్వీప్ చేయబోతున్నాం..' అని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత ధీమా వ్యక్తంచేశారు. పోలీసులు పూర్తి స్వేచ్ఛతో విధులు నిర్వర్తిస్తున్నారని స్పష్టం చేశారు. ఒకవైపు ఈడీ దాడులు, మరోవైపు వైఎస్ వివేకా హత్య కేసు వేళ్లన్నీ తాడేపల్లి ప్యాలెస్ వైపే చూపుతుండడంతో జగన్ లో ఆందోళన మొదలైందన్నారు. త్వరలో వైసీపీ క్లోజ్ అవ్వడం ఖాయమని మంత్రి సవిత తెలిపారు. శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండలోని క్యాంపు కార్యాలయంలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా నామినేషన్ల ప్రారంభమైన మొదటిరోజే గొడ్డలి పార్టీ నాయకులు పెట్రేగిపోయారన్నారు. పక్కరాష్ట్రాల నుంచి గూండాలను తీసుకొచ్చి టీడీపీ నాయకులు, కార్యకర్తలపై దాడులకు తెగబడ్డారన్నారు. తిరుపతి, రాయచోటి, పుంగనూరు, ధర్మవరంతో పాటు పలు చోట్ల వైసీపీ కార్యకర్తలు ప్రజలను భయభ్రాంతులకు గురి చేశారని మంత్రి సవిత ఆగ్రహం వ్యక్తంచేశారు.

### వీధి రౌడీలా ఎంపీ మిథున్ రెడ్డి...

స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓటమి ఖాయమని తేలిపోవడంతో వైసీపీ నాయకులు విచక్షణ మరిచిపోయి, దాడులకు తెరతీశారని మంత్రి సవిత మండిపడ్డారు. ఎంపీ మిథున్ రెడ్డి వీధి రౌడీలా ప్రవర్తిసూ...నామినేషన్ కేంద్రంలో టీడీపీ కార్యకర్తలపై దాడులకు దిగారన్నారు. వైసీపీ దౌర్జన్యాలపై తమ నాయకులు ఎన్నికల కమిషన్ దృష్టికి తీసుకెళ్లారన్నారు. దాడులకు తెగబడిన వారిపై చర్యలకు చట్టపరంగా ముందకెళ్తామన్నారు. పోలీసులు పూర్తి స్వేచ్ఛతో విధులు నిర్వర్తిస్తున్నారన్నారని మంత్రి సవిత స్పష్టంచేశారు.

### వైసీపీ పని క్లోజ్...

గత స్థానిక సంస్థల ఎన్నికల సమయంలో వైసీపీ నాయకులు ఎలా వ్యవహరించారో రాష్ట్ర ప్రజలందరికీ తెలుసని మంత్రి సవిత తెలిపారు. వారిలా తమ పార్టీ నాయకులు నామినేషన్లు చించలేదని, బెదిరింపులకు, దౌర్జన్యాలకు పాల్పడడం లేదని తెలిపారు. ప్రజాస్వామ్యయుతంగా ఎన్నికలు జరిగాలన్నది తమ అభిమతమన్నారు. ఒకవైపు ఈడీ వరుస దాడులు, మరోవైపు వైఎస్ వివేకా హత్య కేసులో వేళ్లన్నీ తాడేపల్లి ప్యాలెస్ వైపే చూపిస్తున్నాయని, ప్యాలెస్ పెద్దలు విలవిలలాడుతున్నారని మంత్రి సవిత తెలిపారు. దీంతో ఏం చేయాలో పాలుపోక, జగన్ రెడ్డి రాష్ట్రంలో విధ్వంసాలకు తెరతీశారన్నారు. కూటమి ప్రభుత్వం ప్రశాంతంగా ఎన్నికలు నిర్వహించాలని చూస్తుంటే. ఆయన మాత్రం శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. వైసీపీ పని ముగిసిందని, త్వరలో ఆ పార్టీ క్లోజ్ అవ్వబోతోందని మంత్రి సవిత తెలిపారు.

### 'స్థానికం'లో క్లీన్ స్వీప్ చేస్తున్నాం...

అయిదేళ్ల పాలనలో వైసీపీ నాయకులు దోపిడీ, దౌర్జన్యాలతో కాలం గడిపారని, వారికి ఓటు అడిగే హక్కు కూడా లేదని మంత్రి సవిత అన్నారు. పులివెందుల సహా అన్నీ స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ కూటమి పార్టీలు క్లీన్ స్వీప్ చేయబోతున్నాయని ధీమా వ్యక్తంచేశారు. కూటమి నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా పనిచేయాలని, అభ్యర్థి ఎవరైనా విజయానికి కృషి చేయాలని మంత్రి సవిత పిలుపునిచ్చారు.

# తెలంగాణ నీళ్లను తరలించే కుట్ర.. చంద్రబాబు ప్లాన్‌కు రేవంత్ సహకారం

రాష్ట్ర ప్రయోజనాలను దెబ్బతీస్తూ తెలంగాణ సమాజానికి తీరని ద్రోహం చేస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రంలోని సాగునీటి ప్రాజెక్టుల్లో నీళ్లు లేకుండా చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయని, ఎల్‌నినో పేరుతో ప్రభుత్వం చేతులెత్తేస్తోందని మండిపడ్డారు. అత్యంత కీలకమైన సాగునీటి విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం ఏంటని ప్రశ్నించారు. తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడిన ఆయన.. రాష్ట్రంలో నెలకొన్న కరవు పరిస్థితులకు రేవంత్‌రెడ్డి ప్రభుత్వమే కారణమని ఆరోపించారు. దేవాదుల ప్రాజెక్టులో 10 మోటార్లు అందుబాటులో ఉన్నప్పటికీ మూడు మాత్రమే నడిపిస్తున్నారని హరీశ్‌రావు విమర్శించారు. తాము అభ్యంతరాలు వ్యక్తం చేసిన తర్వాతే ప్రభుత్వం స్పందించిందని అన్నారు. తెలంగాణతో పోలిస్తే ఆంధ్రప్రదేశ్‌లో తక్కువ వర్షపాతం నమోదైనా అక్కడ కరవు పరిస్థితులు, పంటల సాగుకు విరామం ప్రకటించే పరిస్థితి లేదని పేర్కొన్నారు. తెలంగాణలో మాత్రం రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని విమర్శించారు. గోదావరి జలాలను ఇతర ప్రాంతాలకు తరలించేందుకు ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రయత్నిస్తున్నారని హరీశ్‌రావు ఆరోపించారు. గోదావరి-కావేరి అనుసంధానం పేరుతో తెలంగాణ నీటిని తరలించే ప్రతిపాదనలకు రేవంత్‌రెడ్డి సహకరిస్తున్నారని విమర్శించారు. గతంలో గోదావరి-బనకచర్ల, గోదావరి-నల్లమలసాగర్ ప్రతిపాదనలు ముందుకు సాగలేదని, ఇప్పుడు గోదావరి-కావేరి అనుసంధానం పేరుతో కొత్త ప్రయత్నాలు జరుగుతున్నాయని అన్నారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఏపీ నేతలు ఇలాంటి ప్రతిపాదనలు చేయలేదని హరీశ్‌రావు పేర్కొన్నారు. రేవంత్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాతే ఏపీ పాలకులు కొత్త ప్రతిపాదనలను తెరపైకి తెస్తున్నారని ఆరోపించారు. తెలంగాణ నీటి ప్రయోజనాలను కాపాడటంలో ప్రభుత్వం విఫలమవుతోందని విమర్శించారు. రైతులను కానీ, ప్రజలను కానీ మీ సావు మీరు సావండి అని రేవంత్ రెడ్డి అంటుండని మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు ఫైర్ అయ్యారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రేవంత్‌రెడ్డి ఏదైనా పైసలు పెట్టి కొనొచ్చు కానీ నీళ్లు కొంటమా..? నీళ్లను కొనలేము అంటున్నడు. మరి అంత ప్రాధాన్యత కలిగిన నీళ్ల విషయంలో ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నావ్. నేను మొదటి నుంచి చెబుతున్నా.. ఇది కాలం తెచ్చిన కరువు కాదు.. కాంగ్రెస్ తెచ్చిన కరువు అని.. దానికి ఈ రూంలో ఉన్న జర్నలిస్టులే సాక్ష్యమన్నారు. పాపం చనిపోయిన మా పెద్ది సుదర్శన్ రెడ్డి కూడా పోరాడిండు. దేవాదులలో నీళ్లొస్తున్నాయి..చెరువులు నింపు అని నేను ఇక్కడ ప్రెస్‌మీట్‌లో మాట్లాడినా.. వరంగల్ పోయి మాట్లాడినా.. మా పెద్ది సుదర్శన్ రెడ్డి కూడా మాట్లాడారు.

## హైకోర్టులో వైఎస్సార్‌సీపీ హౌస్ మోషన్ పిటిషన్




తాడేపల్లి: పుంగనూరు మున్సిపాలిటీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ తీవ్ర ఉత్కంఠకు దారితీసింది. పుంగనూరులో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు నామినేషన్లు వేయకుండా అడ్డుకోవడంపై పార్టీ అధిష్టానం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ నేపథ్యంలో, అభ్యర్థుల నామినేషన్ల ప్రక్రియ సజావుగా సాగేలా చూడాలని, పోలీసు రక్షణ కల్పించేలా ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ వైఎస్సార్‌సీపీ ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో హౌస్ మోషన్ పిటిషన్ దాఖలు చేసింది. ఈ వివాదంపై తిరుపతిలో రాజంపేట ఎంపీ మిథున్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. పుంగనూరు మున్సిపాలిటీ ఎన్నికలలో పార్టీ అభ్యర్థుల పోటీపై ఎట్టి పరిస్థితుల్లోనూ వెనక్కి తగ్గేది లేదని ఆయన స్పష్టం చేశారు. అధికార పార్టీ అడ్డంకులు సృష్టించినా, ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నికల బరిలో నిలిచి తీరుతామని వెల్లడించారు. 'పుంగనూరు మున్సిపాలిటీ ఎన్నికల్లో పోటీ చేయడంపై వైఎస్సార్‌సీపీ ఎక్కడా రాజీ పడదు. ఇది మా అభ్యర్థుల హక్కు. నామినేషన్ల ప్రక్రియలో అక్రమాలను అడ్డుకోవడానికి, మా అభ్యర్థుల న్యాయమైన హక్కులను కాపాడటానికి ఎంతటి న్యాయ పోరాటానికైనా మేము సిద్ధం'అని ప్రకటించారు.ౚ

## ఏపీలో ఎమర్జెన్సీ రోజులు తలపిస్తున్నాయి: పెద్దిరెడ్డి



తిరుపతి: రాష్ట్రంలో ఎమర్జెన్సీ రోజులు తలపిస్తున్నాయని వైఎస్సార్‌సీపీ నేత, మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మండిపడ్డారు. పోలీసులతో నామినేషన్లు అడ్డుకుంటున్నారని.. దేశంలో ఎక్కడ ఇలాంటి ఘటనలు జరగలేదని పెద్దిరెడ్డి అన్నారు. ఈ కూటమి ప్రభుత్వానికి ప్రజలే బుద్ధి చెబుతారన్నారు. నామినేషన్ల చివరి రోజు కూటమి ప్రభుత్వం కుట్రలకు తెరతీసింది. చివరి రోజు కావడంతో నామినేషన్లు వేయకుండా పోలీసులతో కూటమి సర్కార్ కట్టడి చేస్తోంది. మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి పోలీసులు నోటీసులు ఇచ్చారు. మారుతీ నగర్‌లో నోటీసులు ఇచ్చిన సదుం పోలీసులు.. ఇంటి నుంచి పుంగనూరుకు వెళ్ళొద్దంటూ నోటీసులో పేర్కొన్నారు. ఎంపీ మిథున్‌రెడ్డి కుడా పోలీసులు నోటీసులు ఇచ్చారు. మిథున్ రెడ్డి మాట్లాడుతూ.. నామినేషన్లు వేయడానికి క్లియరెన్స్ సర్టిఫికెట్ కోసం అప్లై చేసిన ప్రతి ఒక్కరిని కేసుల్లో ఇరికించారు. మా నాయకుడు వైఎస్ జగన్ నియోజకవర్గం పులివెందులలో కూడా నామినేషన్లు అడ్డుకుని దౌర్జన్యం చేస్తున్నారంటూ ఆయన మండిపడ్డారు. "పుంగనూరు నుంచి పులివెందుల వరకు ఇదే పరిస్థితి. టీడీపీకి సత్తా ఉంటే ఎన్నికల్లో పోటీ చేసి గెలవాలి.. ఇలాంటి అరాచకాలకు పాల్పడకూడదు. అధికారులు ఆలోచించుకోవాలి. ఎన్నికల అధికారులు విచారణ చేస్తే మీరే ఇబ్బందులు పడతారు, అధికారులు బలి కావద్దు. ఈ ప్రభుత్వం ఎల్లకాలం ఉండదు. టీడీపీ ప్రభుత్వానికి మిగిలింది ఒక రెండేళ్లు మాత్రమే. అధికారులను వాడుకుని.. గూండాలను తరలించి గొడవలు చేస్తున్నారు. ఈ ప్రభుత్వం పతనానికి నాంది మొదలయ్యింది" అని మిథున్‌రెడ్డి పేర్కొన్నారు.

## ఇరాన్ కీలక నిర్ణయం.. రక్షణ మంత్రి నియామకం



టెహ్రాన్: పశ్చిమాసియా యుద్ధంలో ఇరాన్‌కు కలిగిన నష్టం గురించి ప్రత్యేకించి చెప్పాల్సిన అవసరం లేదు. అమెరికా, ఇజ్రాయెల్ జరిగిన సంయుక్త దాడిలో తొలిరోజే ఇరాన్ సుప్రీం లీడర్ ఆయతుల్లా ఖమేనీతో పాటు పలువురు అగ్రనేతలు మృతిచెందారు. వారిలో ఆ దేశ రక్షణమంత్రి సైతం ఉన్నారు. ఈ నేపథ్యంలో ఆయన మరణించిన ఎనిమిది నెలల తర్వాత ఆ స్థానంలో ఇరాన్ రక్షణమంత్రిని నియమించింది. ఆ దేశ రక్షణమంత్రిగా మెహర్‌దాద్ అఖ్లాఘీని నియామకానికి ఈరోజు (ఆదివారం) జరిగిన విశ్వాస తీర్మానం ద్వారా ఆమోదం లభించింది. ప్రభుత్వ వెబ్‌సైట్ ప్రకారం మొత్తం 277 మంది సభ్యులు ఓటింగ్‌లో పాల్గొనగా అఖ్లాఘీకి అనుకూలంగా 237 ఓట్లు వచ్చాయి. గతంలో రక్షణ మంత్రిగా పనిచేసిన అజీజ్ నాసిర్జాదే స్థానంలో అఖ్లాఘీ నియమితులయ్యారు. పార్లమెంట్‌లో ఓటింగ్‌కు ముందు అఖ్లాఘీ మాట్లాడుతూ, "నాకు పార్లమెంట్ విశ్వాస తీర్మానం ద్వారా ఆమోదం లభిస్తే, ఈ కీలకమైన సమయంలో రక్షణ మంత్రిత్వ శాఖ బాధ్యతలు నా చేతుల్లోకి వస్తాయి. ఇలాంటి పరిస్థితుల్లో దేశాన్ని రక్షించాలంటే ప్రస్తుత పరిస్థితులపై కచ్చితమైన అవగాహన ఉండాలి. పరిణామాల వెనుక ఉన్న తర్కాన్ని అర్థం చేసుకోవాలి. ప్రభావం చూపే ధోరణులను గుర్తించాలి. భవిష్యత్తులో ఎదురయ్యే వివిధ అవకాశాలు, పరిస్థితులను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలి" అని అఖ్లాఘీ పేర్కొన్నారు. అఖ్లాఘీకి గతంలో సైనిక హోదా లేకపోయినప్పటికీ, ఆయనకు రక్షణ రంగంలో సుదీర్ఘ అనుభవం ఉంది. గత 42 ఏళ్లుగా ఇరాన్ రక్షణ మంత్రిత్వ శాఖలో పనిచేస్తున్నారు. అంతేకాకుండా, ప్రభుత్వ ఆధ్వర్యంలో ఆయుధాలను తయారు చేసే సంస్థ అయిన ఇరాన్ డిఫెన్స్ ఇండస్ట్రీస్ ఆర్గనైజేషన్‌కు 2013 నుంచి అధిపతిగా వ్యవహరిస్తున్నారు.

## భారత్ విమానాలపై.. పాక్ కీలక నిర్ణయం



ఇస్లామాబాద్: పాకిస్థాన్ కీలక నిర్ణయం తీసుకుంది. ఆ దేశ గగనతలం మీదుగా భారత విమానాలు ప్రయాణించడంపై విధించిన నిషేధాన్ని మరో నెల రోజుల పాటు పొడిగించింది. ఈ నిషేధం 2026 నవంబర్ 24 వరకు అమలులో ఉండనున్నట్లు ప్రకటించింది. భారతదేశంలో రిజిస్టర్ అయిన విమానాలతో పాటు, భారతీయ విమానయాన సంస్థలకు చెందిన, ఆ సంస్థలు నిర్వహించే లేదా లీజుకు తీసుకున్న విమానాలకూ ఈ నిషేధం వర్తిస్తుంది. అదే విధంగా సైనిక విమానాలకు ఈ ఆంక్షలు వర్తిస్తాయని పేర్కొంది. పహల్గామ్ ఉగ్రదాడి నేపథ్యంలో ఇరు దేశాల మధ్య సంబంధాలు పూర్తిగా క్షీణి?ంచాయి.ఈ దాడిలో పాకిస్థాన్ ప్రమేయం ఉందని భారత్ ఆరోపించింది. అయితే, ఆ ఆరోపణలను పాకిస్థాన్ తిరస్కరించింది. ఈ ఘటన అనంతరం ఇరు దేశాల మధ్య దౌత్యపరమైన, సైనికపరమైన ఉద్రిక్తతలు తీవ్రంగా పెరిగాయి. ఈ ఉద్రిక్తతల నేపథ్యంలో భారత విమానాలపై పాక్ తొలిసారిగా 2025 ఏప్రిల్ 23న ఈ ఆంక్షలను విధించింది. అప్పటి నుంచి భారత్, పాకిస్థాన్‌ల మధ్య కొనసాగుతున్న ఉద్రిక్త సంబంధాల నేపథ్యంలో పాకిస్థాన్ ఎప్పటికప్పుడు ఈ నిషేధాన్ని పొడిగిస్తూ వస్తోంది. భారత్, పాకిస్థాన్‌ల మధ్య 2025 ఏప్రిల్‌లో పరస్పర గగనతల ఆంక్షలు ప్రారంభమయ్యాయి. జమ్మూకశ్మీర్ కేంద్రపాలిత ప్రాంతంలోని పహల్గామ్‌లో జరిగిన ఉగ్రవాద దాడి అనంతరం ఇరు దేశాలు ఒకదానికొకటి చెందిన విమానాలపై ఆంక్షలు విధించాయి. పాకిస్థాన్ తన గగనతలాన్ని భారత విమానాలకు మూసివేసిన నేపథ్యంలో, దానికి ప్రతిస్పందనగా భారత్ కూడా 2025 ఏప్రిల్ 30న పాకిస్థాన్ విమానయాన సంస్థలకు తన గగనతలాన్ని మూసివేసింది. భారత్, పాకిస్థాన్‌ల మధ్య కొనసాగుతున్న ఈ గగనతల ఆంక్షల ప్రభావం విమానయాన కార్యకలాపాలపై పడుతోంది. ముఖ్యంగా కొన్ని అంతర్జాతీయ విమానాలు తమ గమ్యస్థానాలకు చేరుకోవడానికి ప్రత్యామ్నాయ మార్గాల్లో, ఎక్కువ దూరం ప్రయాణించాల్సి వస్తోంది. దీంతో విమానయాన సంస్థల కార్యకలాపాలపై ప్రభావం పడుతోంది.

# ప్రపంచంలో 64.5 కోట్లమందికి ఆకలి బాధ

### వృథా అయిన ఆహారం వందకోట్ల టన్నులు
### ప్రపంచ ఆర్థికవ్యవస్థకు రూ.90 లక్షల కోట్ల నష్టం
### ఐక్యరాజ్యసమితి ఎఫ్ఏవో 2025 నివేదిక వెల్లడి



అమరావతి: ఒకవైపు ఆకలి కేకలు.. మరోవైపు చెత్తలోకి గుట్టలుగుట్టలుగా పారబోస్తున్న ఆహారం.. ఇదీ ప్రస్తుతం ప్రపంచంలో నెలకొన్న పరిస్థితి. ఐక్యరాజ్య సమితికి చెందిన ఆహార, వ్యవసాయ విభాగం (ఎఫ్ఏవో) 2025 సంవత్సరానికి సంబంధించిన లెక్కలతో విడుదల చేసిన తాజా నివేదిక ఈ అంశాన్ని మరోసారి ప్రముఖంగా ప్రస్తావించింది. ఆహురాన్ని వృథాచేయడం వల్ల పేదప్రజలు ఆకలితో అలమటిస్తుండటంతోపాటు ప్రపంచ ఆర్థికవ్యవస్థకు తీవ్రనష్టం కలిగిస్తోందని ఆ నివేదిక పేుర్కొంది. ఆ నివేదికలోని ప్రధాన అంశాలు ఇవీ..

### ఆకలి కేకలు

' ప్రపంచవ్యాప్తంగా 2025లో 64.5 కోట్లమంది ఆకలితో బాధపడ్డారు. ప్రతి 13 మందిలో ఒకరికి ఆహారం దొరకలేదు.

' కోవిడ్ వ్యాప్తితో ఆకలి బాధితుల సంఖ్య విపరీతంగా పెరిగింది. 2019లో ప్రపంచంలో ఆకలి బాధితులు 61 కోట్లమంది ఉండేవారు.

' గత మూడేళ్లుగా ప్రపంచంలో ఆకలి బాధితుల సంఖ్య క్రమంగా తగ్గుముఖం పడుతోంది. 2022లో 8.6 శాతం ఉన్న ఆకలి బాధితుల సంఖ్య 2024లో 8.1 శాతానికి, 2025లో 7.8 శాతానికి తగ్గింది. కానీ కోవిడ్ వ్యాప్తికి ముందున్న స్థితికి ఇంకా చేరుకోలేదు.

' ఆఫ్రికా ఖండంలో ఆకలి బాధితులు ఎక్కువగా ఉన్నారు. ఆ ఖండంలో 30.9 కోట్లమంది పౌష్టికాహార లోపంతో బాధపడుతున్నారు. ప్రతి అయిదుగురిలో ఒకరు ఆకలి బాధితులే. ఆసియా ఖండంలో 29.2 కోట్లమంది, లాటిన్ అమెరికా దేశాలు, కరేబియన్ దీవుల్లో 3.2 కోట్లమంది కనీస ఆహారానికి నోచుకోవడం లేదు.

' 8 దేశాల్లో ఆకలి బాధ అత్యంత ఆందోళనకరంగా ఉంది. వాటిలో 7 దేశాలు ఆఫ్రికా ఖండంలోనే ఉన్నాయి. మొదటి స్థానంలో సోమాలియా ఉంది.

ఆహారం వృథా

' ప్రపంచవ్యాప్తంగా ఆహారం భారీగా వృథా అవుతోంది. 2025లో వందకోట్ల టన్నుల ఆహారం వృథా అయింది.

' ఆహార ఉత్పత్తుల్లో 13 శాతం దుకాణాలకు చేరడానికి ముందే.. స్టోరేజ్, రవాణా, ఫుడ్ ప్రాసెసింగ్ తదితర ప్రక్రియల్లో వృథా అవుతోంది. దీనివిలువ రూ.37.94 లక్షల కోట్లు కావడం విభ్రాంతి కలిగిస్తోంది.

' ఇక దుకాణాలు, రెస్టారెంట్లు, కుటుంబాలు ఐదో వంతు ఆహారాన్ని చెత్తబుట్టలో పారబోస్తున్నాయి. దీన్లో కుటుంబాల వాటా 60 శాతం కాగా రెస్టారెంట్లు, దుకాణాలు 28 శాతం, ఇతరత్రా 12 శాతం.

' ప్రపంచంలో ప్రతి వ్యక్తి ఏటా సగటున 132 కిలోల ఆహారాన్ని వృథా చేస్తున్నారు. అందులో 79 కిలోల వృథా

### ఇంటివద్దే.

' ఆహార వృథాలో మాల్దీవులు మొదటి స్థానంలో, స్పెయిన్ చివరి స్థానంలో ఉన్నాయి. మాల్దీవుల్లో ప్రతి వ్యక్తి ఏటా సగటున 260 కిలోల ఆహారాన్ని వృథా చేస్తున్నారు. స్పెయిన్‌లో ప్రతి వ్యక్తి ఏటా సగటున 39 కిలోలను వృథా చేస్తున్నారు.

' వృథా చేస్తున్న ఆహారంతో ప్రపంచ ఆర్థికవ్యవస్థ ఏటా రూ.90 లక్షల కోట్లు నష్టపోతోంది.

' ప్రపంచంలో 28 శాతం సాగుభూమిలో పండిస్తున్న పంట వృథా అవుతోంది.

' ఆహార వృథా ప్రపంచంలో దాదాపు 8 శాతం కాలుష్యానికి కారణమవుతోంది.

# లాకప్ హత్యపై భేషైన తీర్పు!




ఎన్డీయే కూటమి ఏలుబడిలో ఆంధ్రప్రదేశ్ చిత్రహింసల కొలిమిగా మారిన నేపథ్యంలో మొన్న మే నెలలో పోలీసు యమకింకరుల చేతుల్లోబడి మాయమైన 25 ఏళ్ల యువకుడు గాదె సాయికృష్ణ అదృశ్యం కేసును సీబీఐకి అప్పగిస్తూ రాష్ట్ర హైకోర్టు శుక్రవారం ఇచ్చిన ఆదేశం హర్షించదగింది. దీంతోపాటు సాయికృష్ణ తల్లి విజయలక్ష్మికి నాలుగు వారాల్లోపు రూ. 25 లక్షల పరిహారం చెల్లించాలని కూడా ధర్మాసనం ఆదేశించింది. కాపుల మద్దతు పుష్కలంగా ఉన్నదని చెప్పుకునే జనసేనతో కలిసి ప్రభుత్వాన్ని నడుపుతూ అదే కులానికి చెందిన యువకుణ్ణి విజయవాడ కృష్ణలంక పోలీసులు లాకప్‌లో కొట్టి చంపి, బూడిద కూడా మిగలకుండా చేశారంటే వారి బరితెగింపు ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. తన కుమారుణ్ణి మొన్న మే నెల మొదటి వారంలో అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్లో తీవ్రంగా హింసిస్తున్నారని తెలిసి, రోజుల తరబడి తల్లి స్టేషన్ చుట్టూ తిరిగారు. పోలీసు అధికారుల కాళ్లావేళ్లా పడ్డారు. ఈ క్రమంలో ఒకరోజు సాయికృష్ణ ఆర్తనాదాలు వినబడి పరుగున వెనక్కివెళ్లి విలపించారు. అయినా వాళ్లు కనికరించలేదు. 'కనీసం బూడిదైనా ఇస్తే అంత్యక్రియలు చేసుకుంటాం...' అని అడిగినా జవాబిచ్చే దిక్కులేదు. చివరకు సీబీఐ దర్యాప్తు కోరుతూ ఆమె హైకోర్టును ఆశ్రయిస్తే... ఆ తల్లిని ఏమార్చటానికి కోర్టు వెలుపల ఎన్ని ప్రయత్నాలు జరిగాయో జనమంతా చూశారు. ఏపీ పోలీసులకేమైంది? కొట్టి చంపి, శవాన్ని మాయం చేసేంత అపరాధం ఆ యువకుడు ఏం చేశాడు? చట్టప్రకారం అరెస్టు చేసిన వారిని 24 గంటల్లో సమీప మేజిస్ట్రేట్ కోర్టులో హాజరుపరచాలి. కానీ బాబు ఏలుబడిలో ఇది సక్రమంగా అమలైంది లేదు. ప్రతిపక్ష వైఎస్సార్ కాంగ్రెస్ కార్యకర్తలపైనా, నాయకులపైనా అక్రమ కేసులు పెట్టిఅరెస్టు చేయడం, రోజుల తరబడి అక్రమ నిర్బంధంలో ఉంచటం, బెయిలొస్తే వేరే కేసులో తిరిగి నిర్బంధంలోకి తీసుకోవటం రివాజుగా మారింది. చివరకు కూటమి పాలన అవకతవకలపై పోస్టులు పెట్టే సాధారణ జనాన్ని కూడా వదలడం లేదు. వేలమందిగూండాలనూ, రౌడీలనూ వైఎస్సార్ కాంగ్రెస్ నాయకుల ఇళ్లపై దాడులకు పంపడం, చేయాల్సిన విధ్వంసమంతా పూర్తయ్యాక పోలీసులు బాధితులనే అరెస్టుచేయడంబాబు తీసుకొచ్చిన దుష్ట సంప్రదాయం. ఈ వాతావరణమే పోలీసులకు ధైర్యాన్నిచ్చింది. తమను అడిగేవాడు లేడని విర్రవీగే స్థాయికి చేర్చింది. వాస్తవానికి పోలీసు ఆగడాలకు బలైంది సాయికృష్ణ మాత్రమే కాదు... వారి చిత్రహింసలకు తాళలేక తనువు చాలిస్తున్నానంటూ దళిత యువకుడు క్రాంతికుమార్ వీడియోలో ప్రకటించి మరీ ఆత్మహత్య చేసుకున్నాడు. అంతకుముందూ, ఆ తర్వాతా గంగమ్మ, తిరుపతమ్మ అనే మహిళల్ని సైతం లాకప్‌లో కొట్టి చంపినట్టు ఆరోపణలొచ్చాయి. మరో మహిళ కళావతి కూడా వీరి వేధింపులవల్లే ఆత్మహత్య చేసుకున్నదని కథనాలు వచ్చాయి. ఇలా పలువురు మరణించిన సందర్భాలున్న నేపథ్యంలో కేవలం సాయికృష్ణ అదృశ్యంపై సీబీఐ దర్యాప్తు చేస్తే సరిపోదు. మిగిలిన కేసుల్ని సైతం ఈ దర్యాప్తు పరిధిలోకి చేర్చాలి. అప్పుడు మాత్రమే ఈ ధోరణి కాస్తయినా తగ్గుతుంది. నారా వారి ఏలుబడి ముందూ మునుపూ కూడా ఇలాగే ఉంది. ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్‌లో నక్సలైట్లను అణచే పేరిట తెలంగాణ పల్లెల్లో యువకుల్ని మాయం చేయటం, ఎన్‌కౌంటర్లలో హతమార్చటం, చట్టబద్ధమైన ఉద్యమాలపై కత్తిగట్టి ప్రైవేటు ముఠాల్ని ప్రోత్సహించి హత్యలు చేయించటం ఆ కాలంలో నిత్యకృత్యం. ఈ ప్రతీకార వాతావరణంలోనే అలిపిరి దగ్గర చంద్రబాబుపై హత్యాయత్నం జరిగింది. చిత్రమేమంటే దీనివల్ల సానుభూతి వెల్లువెత్తుతుందని భ్రమించి ఎన్నికలకు పోతే జనం టీడీపీని మాత్రమే కాదు... జాతీయ స్థాయిలో టోకున ఎన్డీయే కూటమిని చిత్తుగా ఓడించారు. 'పీడకు పిశాచం తోడైనట్టు...' ఇప్పుడు కొడుకు చేతికందిరావటంతో ఆ అరాచకాలు మరిన్నిరెట్లు పెరిగాయి. వైఎస్సార్ కాంగ్రెస్ ఎంపీ గురుమూర్తి ఈ కేసుకు సంబంధించిదాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు గత నెలలో ఆందోళన వ్యక్తం చేసింది. సీబీఐ దర్యాప్తు వేగవంతంగా పూర్తయి దోషులకు కఠిన శిక్షలు పడితేనేఈ మాదిరి అరాచకాలు ఆగుతాయి.

# జెన్ జీ భాష.. క్షీణతా.. పరిణామమా?

భాష అన్నది ఒక నది. పుట్టిన చోట రాయిని రాయిని తాకుతూ, ఒంపులు తిరుగుతూ, ప్రతి తరం గట్టునా పాత ఇసుకను వదిలిపెడుతూ కొత్త ఇసుకను మోస్తూ, ప్రవహిస్తుంది. ఈ తరం పిల్లల నోళ్లలోని బ్రూ, వైబ్, 'లోకీ' రిజ్, సిగ్మా, ఫింగర్ హార్ట్, ఆరా.. ఇవన్నీ ఆ కొత్త ఇసుక రేణువులే.. పెద్దలకు ఇది అరాచకంలా, భాషా క్షీణతలా కనిపిస్తుంది. కానీ నిజంగా ఇది క్షీణతేనా, లేక నది తనకు తానే చెక్కుకుంటున్న కొత్త దారేనా? తాతలు మన తండ్రుల ఇంగ్లీషు కలగలిసిన తెలుగును చూసి భయపడ్డారు.. మన తండ్రులు మనం మాట్లాడే హైబ్రి డ్ తెలుగును చూసి అదే భయపడ్డారు. ఇప్పుడు మనం జెన్ జీ సంక్షిప్త పదాలను, ఎమోజీలను, మీమ్‌లను సంజ్ఞలను భాషగా కాకుండా భాషకు వచ్చిన జ్వరంగా చూస్తున్నాం. కానీ ప్రతి భయమూ తాత్కాలికం, మార్పు శాశ్వతం.

### సంజ్ఞలు, మీమ్‌లతో కమ్యూనికేషన్..

జెన్ జీ తన భావాలను వ్యక్తీకరించడానికి పొడవైన వ్యాసాలు, ప్రసంగాల కన్నా మీమ్‌లను, సంజ్ఞలను, స్లాంగ్‌ను ఒక శక్తివంతమైన సాధనంగా మార్చుకుంది. ఇందులో ఒక కొత్తదనం ఉంది. 'పీస్ సైన్' కేవలం చిహ్నం కాదు, అది ఒక వైఖరి. 'హార్ట్ హ్యాండ్స్' కేవలం ఫోటో పోజు కాదు, అది ఒక ఉద్యమం పట్ల మద్దతు, ఐక్యతకు సంకేతం. ఒక చిత్రం, ఒక సంజ్ఞ ద్వారా సమాచారాన్ని వేగంగా అందించడం. ఇది మెయిన్ క్యారెక్టర్ ఎనర్జీతో బతికే, డిజిటల్ యుగంలో పెరిగిన తరం జీవనశైలికి అనుగుణంగా ఏర్పడిన కొత్త వ్యాకరణం భాషా పరిణామం జీవ పరిణామం లాంటిది.

### అనుభవం కాదు.. వేగం ప్రధానం!

ఇక్కడే లోతైన వేదన దాగి ఉంది. పాత తరాల భాషా మార్పులు నెమ్మదిగా, జీవన అనుభవం నుంచి పుట్టేవి - వ్యవసాయం నుంచి పరిశ్రమకు, గ్రామం నుంచి పట్టణానికి జరిగిన ప్రయాణపు గుర్తులు అవి. కానీ నేటి మార్పు వేగం వేరు.. ఇది జీవితం నుంచి కాదు, తెరల నుంచి పుడుతోంది. ఒక సెకనులో పుట్టి, ఒక వారంలో ప్రపంచమంతా వ్యాపించి, ఒక నెలలో లివింగ్ రెంట్ ఫ్రీగా మనసుల్లో ఉండిపోయి, మరిచిపోయే పదాలు.. ఇందులో వేళ్లు లేవు, అనుభవపు లోతు లేదు, కేవలం వేగం ఉంది.

ఎమోజీలకే పరిమితమైన ఫీలింగ్స్!

భాష అంటే కేవలం పదాలు కావు.. ఆలోచించే విధానం. భాష



సంక్షిప్తమైనప్పుడు, ఆలోచన సంక్షిప్తమవుతుందేమో అనే భయం సహజం. నో క్యాప్ అంటే నిజం చెప్పడం, కానీ ఆ వెనుక ఉండే భావోద్వేగపు లోతు, వాక్యనిర్మాణపు సౌందర్యం కనుమరుగవుతున్నాయా? ఒక తరం తన బాధను, ప్రేమను, కోపాన్ని కేవలం ఒక ఎమోజీతో వ్యక్తం చేయడం మొదలుపెడితే, తన అంతరంగాన్ని లోతుగా తవ్వుకునే అలవాటును కోల్పోతుందేమో అని భయం కలుగుతుంది. ఎమోజీ కన్నీటిని, సంక్షిప్త పదం కవితను పూర్తిగా మోయలేదు. మనసు డెలులు కాకూడదంటే, మాటలు లోతును వదులుకోకూడదు.. సంక్షిప్తత అనేది ఎప్పుడూ లోతుకు శత్రువు కాదు. సంస్కృతంలో సూత్ర శైలి, జపాన్‌లో హైకు కవిత్వం - ఇవి కొన్ని పదాల్లో అనంతమైన అర్థాన్ని మోసిన ఉదాహరణలు..

### భాష ఓ ఆయుధం, గుర్తింపు!

ముందు తరాలలో భాషా మార్పు రేడియో, సినిమా, టీవీ, పత్రికలు మాధ్యమాల ద్వారా వచ్చేది. కానీ జెన్ జీ భాష అనేక మాధ్యమాల ద్వారా- ఇన్‌స్టాగ్రామ్ రీల్స్, టిక్‌టాక్, డిస్కార్డ్, గేమింగ్ చాట్‌ల ద్వారా పుడుతోంది. ఇక్కడ ప్రతి యువకుడూ భాషను సృష్టించేవాడే, వ్యాప్తి చేసేవాడే, మార్చేవాడే, అందుకే ఈ మార్పు వేగం ఇంత ఎక్కువ, తీవ్రత ఇంత లోతు. ఈ తరం భాషను ఒక ఆయుధంగా, ఒక గుర్తింపుగా మలుచుకుంటోంది. పెద్దలకు అర్థం కాని భాష మాట్లాడటం ద్వారా వాళ్లు తమకంటూ ఒక ప్రత్యేక ప్రపంచాన్ని నిర్మించుకుంటున్నారు. వేగంగా మారే ప్రపంచంలో, తమ గుర్తింపును కాపాడుకోవడానికి వాళ్లు కనిపెట్టుకున్న కొత్త కవచం ఇది.

### ప్రధాన స్రవంతిలోకి జెన్ జీ భాష!

ఈ కవచం ఇప్పుడు వీధుల్లోకి, చట్టసభల్లోకి కూడా వచ్చింది. ఢిల్లీలో జరిగిన ఒక నిరసనలో పోలీసులు జెన్ జీ యువకులు ఉపయోగించిన సంజ్ఞలు, స్లాంగ్‌ను అర్థం చేసుకోలేకపోయారు. అదే సమయంలో లోక్‌సభలో 'ఫోమో', 'కుచ్చు- పుచ్చు' వంటి పదాలు ఎంపీల చర్చల్లో వినిపించాయి. ఇది తరాల మధ్య కమ్యూనికేషన్ గ్యాప్‌ను చూపి స్తూనే, ఈ భాష ప్రధాన స్రవంతిలోకి ఎంత వేగంగా ప్రవేశిస్తోందో కూడా చెబుతోంది. నిన్నటి వరకు వ్యక్తిగత చాట్‌లకే పరిమితమైన సంజ్ఞలు, ఈరోజు సామాజిక ఉద్యమాల, రాజకీయ చర్చల భాషగా మారుతున్నాయి. ఇది కేవలం ట్రెండ్ కాదు, ఒక తరం తన ప్రతిభను, ఆవేదనను, సామాజిక చైతన్యాన్ని వ్యక్తపరచడానికి ఎంచుకున్న వేదిక.

### మానవ తపనను మోస్తున్న జెన్ జీలు..

జెన్ జీ మాటల్లో గోట్ అంటే మేక కాదు, షీప్ అంటే గొర్రె కాదు. జెన్ జీ భాషలో అంకెలు, అక్షరాలు కూడా పదాలే, డబ్ల్యూ (విన్), మైండ్ యువర్ పి అండ్ క్యూ, 6,7 లాంటివి. ప్రతి అంకెకు అక్షరానికి కూడా విస్తృతమైన అర్థాలు ఉన్నాయి. జెన్ జీ మాటలు మానవ తపనను మోస్తున్నాయి - అర్థమవ్వాలని, అనుసంధానం కావాలని, ప్రేమించాలని, ప్రేమించబడాలని. మాటలు మారతాయి, పాతవి నిశ్శబ్దంగా రాలిపోతాయి - కానీ ఆ తపన మాత్రం మారదు. అదే భాషకు నిజమైన శాశ్వతత్వం. ఒక తరం అంచున నిలబడి, మరో తరాన్ని ఆలింగనం చేసుకుంటూ పని వేగాన్ని పెంచుకుంటూ ఆలోచన విధానం మార్చుకుంటూ అడ్వాన్స్ టెక్నాలజీకి అలవాటు పడుతూ మనమూ నేర్చుకుంటూ జెన్ జీ భాషను ఆహ్వా నిద్దాం. కొత్త బంగారు లోకాన్ని స్వాగతిద్దాం. అంతకు మించి చేసేందుకు ఏముంది కనుక?

## అనంతపురం కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక, రెవెన్యూ క్లినిక్ రద్దు

**అక్టోబర్ 19న కార్యక్రమాలు నిర్వహించరు**

**ప్రభుత్వ సెలవు నేపథ్యంలో నిర్ణయం**

**అర్జీల కోసం కలెక్టరేట్‌కు రావొద్దని కలెక్టర్ సూచన**



అనంతపురం, అక్టోబర్ 18: (మహి న్యూస్): అనంతపురం కలెక్టరేట్‌లో అక్టోబర్ 19వ తేదీ సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక, రెవెన్యూ క్లినిక్ కార్యక్రమాలు నిర్వహించబోరని జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్ తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికలు, మహర్నవమి పండుగ సందర్భంగా ప్రభుత్వ సెలవు ఉన్నందున ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. ఈ విషయాన్ని జిల్లా ప్రజలు గమనించాలని, అర్జీలు సమర్పించేందుకు కలెక్టరేట్‌కు ఎవరూ రావొద్దని సూచించారు. క్షేత్రస్థాయిలో కూడా ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పి.జి.ఆర్.ఎస్.) నిర్వహించబోమని కలెక్టర్ స్పష్టం చేశారు.

## నామినేషన్ల ప్రక్రియను పరిశీలించిన జనరల్ అబ్జర్వర్ బి. స్మరణ్ రాజ్

**అనంతపురం నగరపాలక సంస్థలో నామినేషన్ల దాఖలుపై పరిశీలన**

**ఎన్నికల ఏర్పాట్లపై అధికారులను అడిగి తెలుసుకున్న అబ్జర్వర్**

**ప్రక్రియ సజావుగా సాగేలా కమిషనర్‌కు సూచనలు**





అనంతపురం, అక్టోబర్ 18: (మహి న్యూస్): అనంతపురం నగరపాలక సంస్థ పరిధిలో స్థానిక సంస్థల ఎన్నికలు--2026లో భాగంగా జరుగుతున్న నామినేషన్ల ప్రక్రియను జిల్లా స్థానిక సంస్థల ఎన్నికల జనరల్ అబ్జర్వర్ బి. స్మరణ్ రాజ్, ఐఏఎస్ ఆదివారం పరిశీలించారు. నగరపాలక సంస్థ కార్యాలయానికి చేరుకున్న జనరల్ అబ్జర్వర్‌కు కమిషనర్ జస్వంత్ రావు స్వాగతం పలికారు. అనంతరం అభ్యర్థుల నామినేషన్ల దాఖలు ప్రక్రియను అబ్జర్వర్ నిశితంగా పరిశీలించారు. నామినేషన్ల స్వీకరణకు చేపట్టిన ఏర్పాట్ల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. నామినేషన్ల ప్రక్రియ ఎలాంటి ఇబ్బందులు లేకుండా సజావుగా జరిగేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్‌కు సూచనలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్ఓలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో మీడియా ధృవీకరణ, పర్యవేక్షణ కమిటీ ఏర్పాటు

**అనంతపురం నగరపాలక సంస్థలో ఎంసీఎంసీ ఏర్పాటు**

**రాజకీయ ప్రకటనలకు ముందస్తు ధృవీకరణ తప్పనిసరి**

**పెయిడ్ న్యూస్‌పై కమిటీ పర్యవేక్షణ**



అనంతపురం, అక్టోబర్ 18: (మహి న్యూస్): స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో అనంతపురం జిల్లాలో మీడియా ధృవీకరణ, పర్యవేక్షణ కమిటీ (ఎంసీఎంసీ) ఏర్పాటు చేసినట్లు జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఓ. ఆనంద్ తెలిపారు. మున్సిపాలిటీలు, జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలకు సంబంధించి టీవీ ఛానళ్లు, కేబుల్ నెట్‌వర్క్‌లు, రేడియో, సినిమా హాళ్లు, బహిరంగ ప్రదేశాల్లో ఆడియో విజువల్ ప్రదర్శనలు, ఈ-పేపర్లు, బల్క్ ఎస్ఎంఎస్‌లు, వాయిస్ మెసేజ్‌లు, సోషల్ మీడియాలో ప్రసారమయ్యే రాజకీయ ప్రకటనల ధృవీకరణ కోసం ఈ కమిటీ పనిచేస్తుందని పేర్కొన్నారు. అలాగే పెయిడ్ న్యూస్‌ను పరిశీలించి పర్యవేక్షిస్తుందని తెలిపారు. జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి కమిటీ ఛైర్మన్‌గా, నగరపాలక సంస్థ కమిషనర్, జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ అధికారి సభ్యులుగా వ్యవహరిస్తారు. అనంతపురం నగరపాలక సంస్థ గ్రౌండ్ ఫ్లోర్‌లోని పన్నుల విభాగం గది నంబర్ 12లో ఎంసీఎంసీని ఏర్పాటు చేశారు. గుర్తింపు పొందిన లేదా నమోదైన రాజకీయ పార్టీలు, వ్యక్తిగత అభ్యర్థులు తమ రాజకీయ ప్రకటనల ధృవీకరణ కోసం, ఆ ప్రకటనల ప్రసారం లేదా ప్రదర్శన ప్రారంభమయ్యే తేదీకి కనీసం మూడు రోజుల ముందుగా కమిటీకి దరఖాస్తు సమర్పించాలి. దరఖాస్తును అనెక్సర్--ఏ నమూనాలో సమర్పించడంతో పాటు, ప్రతిపాదిత ప్రకటనకు సంబంధించిన ఎలక్ట్రానిక్ రూపంలో రెండు కాపీలు, ధృవీకరించిన ట్రాన్స్క్రిప్షన్‌ను జతచేయాలి. ఎన్నికల సమయంలో పెయిడ్ న్యూస్‌పై జిల్లా స్థాయి ఎంసీఎంసీ పర్యవేక్షణ కొనసాగిస్తుందని కలెక్టర్ తెలిపారు.

## నామినేషన్ల ప్రక్రియను పరిశీలించిన ఎన్నికల వ్యయ పరిశీలకుడు జి. సుబ్బరాజ్

**నామినేషన్ల ఏర్పాట్లపై అధికారులతో సమీక్ష**

**అభ్యర్థుల రోజువారీ ఎన్నికల ఖర్చులపై నిఘా ఉంచాలని ఆదేశం**

**ఎన్నికల ప్రక్రియ ముగిసే వరకు వ్యయాల పరిశీలన చేపట్టాలని సూచన**





అనంతపురం, అక్టోబర్ 18: (మహి న్యూస్): అనంతపురం నగరపాలక సంస్థలో స్థానిక సంస్థల ఎన్నికలు--2026లో భాగంగా జరుగుతున్న నామినేషన్ల ప్రక్రియను జిల్లా ఎన్నికల వ్యయ పరిశీలకుడు జి. సుబ్బరాజ్, ఐఎఫ్ఎస్ ఆదివారం మధ్యాహ్నం పరిశీలించారు. నగరపాలక సంస్థ కార్యాలయానికి చేరుకున్న వ్యయ పరిశీలకుడికి కమిషనర్ జస్వంత్ రావు స్వాగతం పలికారు. అనంతరం అభ్యర్థుల నామినేషన్ల దాఖలు ప్రక్రియను పరిశీలకుడు నిశితంగా పరిశీలించి, నామినేషన్ల స్వీకరణకు చేసిన ఏర్పాట్లపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రక్రియ సజావుగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని కమిషనర్‌కు సూచించారు. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు నామినేషన్ దాఖలు చేసినప్పటి నుంచి ఎన్నికల ప్రక్రియ ముగిసే వరకు వారి రోజువారీ ఎన్నికల వ్యయాన్ని నిరంతరం పరిశీలించేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అనంతపురం ఆర్డీఓ ప్రేమంత కుమార్, టీపీఓ ఓంకార్, మాస్టర్ ట్రైనర్, రిటైర్డ్ ఎస్‌డీసీ గోవిందరాజులు, ఆయా డివిజన్ల రిటర్నింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# దాడులు చేసింది... ఫిర్యాదు చేసిందీ వారే...

- జగన్ పై మంత్రి సవిత ఆగ్రహం
- దెయ్యాల్లా వేదాలు వల్లిస్తున్న గొడ్డలి పార్టీ నాయకుడు
- నామినేషన్లు ప్రారంభమైన నాటి నుంచి వైసీపీ ఆరాచకాలు
- ఎంపీలు అవినాశ్, మిధున్ రెడ్డి నేతృత్వంలో దాడులు
- ఏమీ ఎరుగనట్లు ఈసీకి జగన్ ఫిర్యాదు
- పులివెందుల, కడపలో భారీగా నామినేషన్ల దాఖలు
- గతంలో ఎన్నడూ ఈ స్థాయిలో దాఖలు కాని నామినేషన్లు
- గొడ్డలి పార్టీలాగా మేం నామినేషన్లు చింపలేదు... వేయకుండా అడ్డుకోలేదు
- 'స్థానికం'లో కూటమి క్లీన్ స్వీప్ ఖాయం : మంత్రి సవిత ధీమా



శ్రీసత్యసాయి/పెనుకొండ మహి న్యూస్ అక్టోబర్ 18 : 'రప్పా...రప్పా నరకడంటూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేసింది వారే... తమ పార్టీ వారితో నామినేషన్లు వేయనివ్వడం లేదు అంటూ రాష్ట్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసిందీ వారే... దెయ్యాలు వేదాలు వల్లించినట్లు ఆయన వ్యవహరిస్తున్నారు...'అంటూ జగన్ రెడ్డిపై రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. స్థానిక ఎన్నికల నామినేషన్ల పర్వం ప్రారంభమైన నాటి నుంచి గొడ్డలి పార్టీ నాయకులు అరాచకాలకు, దాడులకు దిగారన్నారు. ఎన్నికల సంఘం, పోలీసులు తీసుకున్న కట్టుదిట్టమైన చర్యలతో గతంలో ఎన్నడూ లేనివిధంగా పులివెందుల, కడపలో అత్యధిక మంది నామినేషన్లు వేశారన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి పార్టీలు స్వీప్ చేయడం ఖాయమని ధీమా వ్యక్తంచేశారు. శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండలోని క్యాంపు కార్యాలయంలో తనను కలిసిన విలేకరులతో మంత్రి సవిత ఆదివారం మాట్లాడారు. అయిదేళ్ల వైసీపీ పాలనలో రాష్ట్రాభివృద్ధికి చేసిందేమీ లేకపోవడంతో, ప్రజలకు ముఖం చూపే ధైర్యం గొడ్డలి పార్టీ నాయకులు చేయలేకపోతున్నారన్నారు. స్థానిక సంస్థల్లో ఘోర ఓటమి ఖాయమని తెలిసి అరాచకాలకు తెరతీశారన్నారు. నామినేషన్ల పర్వం ప్రారంభమైన నాటి నుంచి వైసీపీ ఎంపీలు అవినాశ్ రెడ్డి, మిధున్ రెడ్డి నేతృత్వంలో పుంగనూరు, పులివెందుల, తిరుపతి, రాయచోటి వంటి ప్రాంతాల్లో దౌర్జన్యాలకు పాల్పడ్డారన్నారు. రప్పా...రప్పా...నరకడంటూ ఆ పార్టీ నేతలు తమ క్యాడర్ ను రెచ్చగొట్టి ప్రజలపైకి ఉసుకొల్పారని మంత్రి సవిత ఆగ్రహం వ్యక్తంచేశారు.

### పులివెందులలో నామినేషన్ల వెల్లువ

గొడ్డలి పార్టీ నాయకుడు జగన్ సొంత నియోజక వర్గమైన పులివెందులలో టీడీపీ సహా పలు పార్టీ నాయకులు భారీగా నామినేషన్లు దాఖలు చేశారని మంత్రి సవిత తెలిపారు. కడపలోనూ ఇదే తరహాలో భారీ ఎత్తున నామినేషన్లు అందజేశారన్నారు. గతంలో ఎన్నడూ పులవెందుల, కడపలో ఇలా భారీ ఎత్తున నామినేషన్లు దాఖలు చేసిన చరిత్ర లేదన్నారు. రాష్ట్ర ఎన్నికల సంఘం, పోలీసులు తీసుకున్న కట్టుదిట్టమైన చర్యలు, ప్రజాస్వామ్యం పరిరక్షణ వల్లే నామినేషన్లు దాఖలయ్యాయన్నారు. గత స్థానిక సంస్థల ఎన్నికల్లో వైసీపీ ఎన్ని ఆరాచకాలకు పాల్పడిందో ప్రజలందరికీ గుర్తుందన్నారు. వారిలాగా నామినేషన్లు చింపడం, వేయకుండా అడ్డుకోవడం వంటి అరాచకాలకు కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్పడలేదని మంత్రి సవిత స్పష్టం చేశారు.

### నరకమన్నది వాళ్లే...ఫిర్యాదు చేసిందీ వాళ్లే...

దెయ్యాలు వేదాలు వల్లించినట్లు జగన్ వ్యవహరిస్తున్నారని మంత్రి సవిత మండిపడ్డారు. నామినేషన్ల సందర్భంగా రాష్ట్రంలో భారీ ఎత్తున అల్లర్లు సృష్టించింది గొడ్డలి పార్టీయేనన్నారు. ఈ విషయం ప్రజలందరికీ తెలుసన్నారు. కాని, జగన్ ఏమీ ఎరుగనట్లు రాష్ట్రంలో ప్రజాస్వామ్యం లేదంటూ ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేయడంపై ప్రజలు నవ్వుకుంటున్నారన్నారు. రప్పా...రప్పా...నరకమన్నది వాళ్లేనని, టీడీపీ నాయకులపైనా, ప్రజలపైనా దాడులకు తెలబడింది వారేనని, ఏమీ ఎరుగనట్లు ఫిర్యాదు చేసిందీ గొడ్డలి పార్టీ నాయకుడేనని విమర్శించారు. స్థానిక సంస్థల్లో ఓటమి ఖాయమని తెలిసి, ఎన్నికలు జరగకూడదన్నది జగన్ ఎత్తుగడని మంత్రి సవిత మండిపడ్డారు.

### క్లీన్ స్వీప్ చేస్తున్నాం

జగన్ ను, గొడ్డలి పార్టీని ప్రజలు నమ్మే పరిస్థితుల్లో లేరని మంత్రి సవిత తెలిపారు. రెండున్నరేళ్ల కూటమి ప్రభుత్వ పాలనలో ఎన్నో సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమలను చేపట్టామన్నారు. ప్రజలు సీఎం చంద్రబాబునాయుడు పాలనపై ఎంతో నమ్మకంతో ఉన్నారన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి పార్టీలు విజయం సాధించడం ఖాయమని, రాష్ట్రమంతటా క్లీన్ స్వీప్ చేయబోతున్నామని మంత్రి సవిత ధీమా వ్యక్తంచేశారు.

## అనంతపురం మేయర్ పదవికి 29 నామినేషన్లు.. 62 డివిజన్లకు 440 నామినేషన్లు

**మూడు రోజుల పాటు కొనసాగిన నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ పూర్తి**

**మేయర్ పదవికి 13 మంది స్వతంత్ర అభ్యర్థుల నామినేషన్లు**

**డివిజన్లలో టీడీపీ నుంచి 197, వైఎస్సార్‌సీపీ నుంచి 161 నామినేషన్లు**

అనంతపురం, అక్టోబర్ 18: (మహి న్యూస్): అనంతపురం నగరపాలక సంస్థ రెండో సాధారణ మున్సిపల్ ఎన్నికలు--2026కు సంబంధించి నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ఆదివారంతో ముగిసింది. అక్టోబర్ 16 నుంచి 18వ తేదీ వరకు మూడు రోజుల పాటు జరిగిన ఈ ప్రక్రియలో మేయర్ పదవికి 29 నామినేషన్లు, నగరపాలక సంస్థ పరిధిలోని 62 డివిజన్లకు 440 నామినేషన్లు స్వీకరించినట్లు కమిషనర్ జస్వంత్ రావు తెలిపారు.

### మేయర్ పదవికి పార్టీల వారీగా నామినేషన్ల వివరాలు:

బహుజన్ సమాజ్ పార్టీ -- 1
భారతీయ జనతా పార్టీ -- 4
కాంగ్రెస్ పార్టీ -- 3
తెలుగుదేశం పార్టీ -- 1
వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ -- 3
ఇతర పార్టీలు -- 4 (నవతరం పార్టీ -- 3, ఆమ్ ఆద్మీ పార్టీ -- 1)
స్వతంత్రులు -- 13
మొత్తం: 29 నామినేషన్లు.

62 డివిజన్లకు పార్టీల వారీగా నామినేషన్ల వివరాలు:
బహుజన్ సమాజ్ పార్టీ -- 2
భారతీయ జనతా పార్టీ -- 15
భారత కమ్యూనిస్టు పార్టీ -- 3
భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) -- 3
కాంగ్రెస్ పార్టీ -- 3
తెలుగుదేశం పార్టీ -- 197
వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ -- 161
జనసేన పార్టీ -- 24
స్వతంత్రులు -- 32
మొత్తం: 440 నామినేషన్లు.

మేయర్ పదవితో పాటు 62 డివిజన్లకు నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ పూర్తయినట్లు నగరపాలక సంస్థ కమిషనర్ జస్వంత్ రావు వెల్లడించారు.

### సూది మందు వికటించి వృద్ధ మహిళ మృతి..

## ప్రథమ చికిత్స కేంద్రం సీజ్

**ఇంజక్షన్ ఇచ్చిన కొద్దిసేపటికే నరసమ్మ మృతి**

**మేఘన ప్రథమ చికిత్స కేంద్రం మూసివేత**

**నిబంధనలకు విరుద్ధంగా వైద్యం చేస్తే కఠిన చర్యలు తప్పవు: డీఎంహెచ్‌వో**




అనంతపురం, అక్టోబర్ 18: (మహి న్యూస్): అనంతపురం నగరంలోని పాత టౌన్ ప్రాంతంలో ఆర్ఎంపీ వైద్యుడు ఇచ్చిన ఇంజక్షన్ వికటించడంతో నరసమ్మ అనే వృద్ధ మహిళ మృతి చెందింది. ఈ ఘటన నేపథ్యంలో తాడిపత్రి బస్టాండ్ పరిధిలోని మేఘన ప్రథమ చికిత్స కేంద్రాన్ని వైద్య ఆరోగ్య శాఖ అధికారులు సీజ్ చేశారు. నగరంలోని సాయినగర్ రెండో క్రాస్‌కు చెందిన నరసమ్మ కీళ్ల నొప్పులు, ఆయాసం సమస్యలతో చికిత్స కోసం మేఘన ప్రథమ చికిత్స కేంద్రం నిర్వాహకుడు జి. రమణ వద్దకు వెళ్లింది. అక్కడ ఆమెకు ఇంజక్షన్ ఇచ్చిన కొద్దిసేపటికే మృతి చెందినట్లు సమాచారం. ఈ ఘటనపై సమాచారం అందుకున్న వైద్య ఆరోగ్య శాఖ అధికారులు సంబంధిత కేంద్రంలో అలోపతి వైద్యం అందిస్తున్నట్లు గుర్తించారు. దీంతో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కట్టా వెంకటేశ్వర్లు కేంద్రాన్ని మూసివేయాలని ఆదేశించారు. ఆయన ఆదేశాల మేరకు నీరుగంటి వీధి పట్టణ ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి నాగజ్యోతి, జిల్లా మాస్ మీడియా అధికారి ఈ. నాగరాజు ఆదివారం ఉదయం కేంద్రాన్ని సీజ్ చేసి, నిర్వాహకుడు జి. రమణకు షోకాజ్ నోటీసు జారీ చేశారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో కట్టా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, ప్రథమ చికిత్స కేంద్రాల పేరుతో అలోపతి వైద్యం చేయడం, గ్లూకోజ్ లేదా సెలైన్ ఎక్కించడం, ఇంజక్షన్లు ఇవ్వడం, మాత్రలు, స్టెరాయిడ్లు వినియోగించడం వంటి చట్టవిరుద్ధ చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అవసరమైతే కేంద్రాలను సీజ్ చేయడంతో పాటు క్రిమినల్ చర్యల కోసం ఫిర్యాదు చేస్తామని స్పష్టం చేశారు.

## తాడిపత్రి మున్సిపల్ కార్యాలయంలో నామినేషన్ల ప్రక్రియను పరిశీలించిన జనరల్ అబ్జర్వర్

**నామినేషన్ స్వీకరణ కేంద్రాల తనిఖీ**

**ఎన్నికల ప్రక్రియపై అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్న అబ్జర్వర్**

**పోలీసు భద్రతా ఏర్పాట్ల పరిశీలన**





అనంతపురం, అక్టోబర్ 18: (మహి న్యూస్): స్థానిక సంస్థల ఎన్నికలు--2026లో భాగంగా తాడిపత్రి మున్సిపల్ కార్యాలయంలో జరుగుతున్న నామినేషన్ల ప్రక్రియను అనంతపురం జిల్లా స్థానిక సంస్థల ఎన్నికల జనరల్ అబ్జర్వర్ బి. స్మరణ్ రాజ్, ఐఏఎస్ ఆదివారం పరిశీలించారు. మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన నామినేషన్ స్వీకరణ కేంద్రాలను తనిఖీ చేసి, అభ్యర్థుల నుంచి నామినేషన్లు ఏ విధంగా స్వీకరిస్తున్నారనే విషయాన్ని ఎన్నికల అధికారులను అడిగి తెలుసుకున్నారు. నామినేషన్ల ప్రక్రియ సజావుగా సాగుతున్న తీరును పరిశీలించారు. అనంతరం మున్సిపల్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన పోలీసు బందోబస్తు, భద్రతా చర్యలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శివరామకృష్ణ, ఎన్నికల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## అనంతపురం ఆర్ట్స్ కళాశాలలో నామినేషన్ల దాఖలు



అనంతపురం, అక్టోబర్ 18: (మహి న్యూస్):





స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో అనంతపురం నగరంలోని ఆర్ట్స్ కళాశాలలో ఏర్పాటు చేసిన రిటర్నింగ్ అధికారి (ఆర్వో) కార్యాలయంలో వివిధ డివిజన్లకు చెందిన అభ్యర్థులు నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు. ఎన్నికల ప్రక్రియలో భాగంగా అభ్యర్థులు తమ నామినేషన్లను సమర్పిస్తున్న దృశ్యాలు.

## అనంతపురంలో మేయర్, డివిజన్లకు నామినేషన్ల దాఖలు



అనంతపురం, అక్టోబర్ 18: (మహి న్యూస్): స్థానిక





సంస్థల ఎన్నికల నేపథ్యంలో అనంతపురం నగరపాలక సంస్థ కార్యాలయంలో ఏర్పాటు చేసిన రిటర్నింగ్ అధికారి (ఆర్వో) కార్యాలయంలో మేయర్ పదవితో పాటు వివిధ డివిజన్లకు అభ్యర్థులు నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు. ఎన్నికల ప్రక్రియలో భాగంగా అభ్యర్థులు తమ నామినేషన్లను సమర్పిస్తున్న దృశ్యాలు.

## కథలాపూర్ దుర్గామాత వద్ద మహా అన్నదాన ప్రసాద వితరణ...

కథలాపూర్ : అక్టోబర్ 18 స్థానిక శ్రీ దుర్గాదేవి శరన్నవరాత్రి ఉత్సవాల పురస్కరించుకుని ఆలయ ప్రాంగణంలో మహా అన్నదాన కార్యక్రమం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్వతి పరమేశ్వర కళ్యాణం నిర్వహించి అమ్మవారికి ఉదయం నుండి ప్రత్యేక అభిషేకాలు, కుంకుమార్చన పూజలు జరిగాయి. అనంతరం భక్తులకు భారీ సంఖ్యలో తీర్థప్రసాదాలు, అన్నప్రసాద వితరణ చేశారు. దాతల సహకారంతో ఏర్పాటు చేసిన ఈ అన్నదాన కార్యక్రమానికి భక్తుల నుంచి విశేష స్పందన లభించింది. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ న్యావనంది శేఖర్, ఉపసర్పంచ్ చెట్ పల్లి ప్రసాద్,గణేష్ భవాని మిత్ర మండలి సభ్యులు, భక్తులు మరియు గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఇచ్చిన మాటను నిలబెట్టుకున్న బంగ్ల లక్ష్మికాంత్ రెడ్డి

ఆత్మకూరు అక్టోబర్ 18 : మక్తల్ నియోజకవర్గం, ఉట్కూర్ మండలంలోని ఎడివెల్లి, పెద్దపొర్ల, పులిమామిడి, బిజ్వార్ మరియు ఆవుసులోనిపల్లి గ్రామాల సర్పంచ్ లు, బీజేపీ నాయకులు మరియు కార్యకర్తల కోరిక మేరకు వారం రోజులక్రితం ఆయా గ్రామాలలో ఎమ్మెల్సీ ఎన్నికల పట్టభద్రుల ఎన్రోల్ మెంట్ ప్రక్రియలో పాల్గొన్న మక్తల్ నియోజకవర్గ ఎమ్మెల్సీ ఇంచార్జ్ డాక్టర్ బంగ్ల లక్ష్మికాంత్ రెడ్డి పర్యటిస్తూ కార్యకర్తల కోరికమేరకు దసరా పండగ లోపలనే హైమాస్ట్ లైట్స్ ఏపిస్తానని మాట ఇచ్చి భూమి పూజ చేసారు. ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటూ దసరా పండుగ కానుకగా ఐదు గ్రామాలలో హైమాస్ట్ లైట్స్ ఫిట్టింగ్ చేయించిన బంగ్ల లక్ష్మికాంత్ రెడ్డి చేత త్వరలోనే ఆకాశదీపాలను వెలిగిస్తామని ఆయాగ్రామాల బీజేపీ కుటుంబ సభ్యులు తెలియజేసారు.

EDITOR and PUBLISHER and OWNED BY NEELI RAMASUBBAIAH, PUBLISHED AT.15-603/1, RAJU ROAD, KAMAL NAGAR, ANANTHAPURAMU, ANDHRA PRADESH - 515001.PRINTED AT VSAR PUBLICATIONS 91/4-31-3-1B, BALAJINAGAR, KURNOOL.. RNI NO : APTEL/26/A7631. Cell 90 59 58 58 98. Email : mahinewsindia@gmail.com, website : https//epaper.mahinewsindia.com

RNI : APTEL/25/A0108 www.mahinewsindia.com epaper: https://epaper.mahinewsindia.com

# ఈ నెల 19న పి.జి.ఆర్.ఎస్ కార్యక్రమం రద్దు

## ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉన్నందున నిర్ణయం

## డైలీ గ్రీవెన్స్ కార్యక్రమం కూడా తాత్కాలికంగా నిలిపివేత

## అర్జీల సమర్పణ కోసం కలెక్టరేట్‌కు రావద్దని కలెక్టర్ సూచన

చిత్తూరు, అక్టోబర్ 18: (మహి న్యూస్): స్థానిక సంస్థల ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉన్నందున ఈ నెల 19వ తేదీ సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించాల్సిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పి.జి.ఆర్.ఎస్), డైలీ గ్రీవెన్స్ కార్యక్రమాలను రద్దు చేసినట్లు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ తెలిపారు. ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో ఈ విషయాన్ని వెల్లడించారు. ఎన్నికల కోడ్ అక్టోబర్ 14 నుంచి డిసెంబర్ 3 వరకు అమలులో ఉంటుందని పేర్కొన్నారు. ఈ గడువు ముగిసే వరకు ప్రతి సోమవారం నిర్వహించే పి.జి.ఆర్.ఎస్ కార్యక్రమాన్ని తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించి అర్జీలు సమర్పించేందుకు కలెక్టరేట్‌కు రావద్దని కలెక్టర్ సూచించారు.

# నామినేషన్లకు సంబంధించి ఫారం-ఏ పత్రాలు కలెక్టర్‌కు అందజేత

## రాజకీయ పార్టీల ప్రతినిధుల నుంచి ఫారం-ఏ పత్రాల స్వీకరణ

## ఫారం-ఏలో సిఫారసు చేసిన అభ్యర్థుల పేర్లనే పరిగణనలోకి తీసుకోవాలని విజ్ఞప్తి







చిత్తూరు, అక్టోబర్ 18: (మహి న్యూస్): చిత్తూరు జిల్లాలో నగరపాలక సంస్థ, పురపాలక సంఘాలు, ఎంపీటీసీ, జెడ్పీటీసీ, ఎంపీపీ ఎన్నికల్లో నామినేషన్లు దాఖలు చేసే అభ్యర్థులకు సంబంధించి రాజకీయ పార్టీల ప్రతినిధులు ఫారం-ఏ పత్రాలను జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్‌కు అందజేశారు. ఆదివారం జిల్లా కలెక్టరేట్‌లో ఈ పత్రాలను సమర్పించారు. రాజకీయ పార్టీల తరపున అభ్యర్థులకు బి-ఫారాలు జారీ చేసేందుకు అధికారం కల్పించే ప్రతినిధుల లేఖలను కూడా అందించారు. ఆయా లేఖల్లో సిఫారసు చేసిన అభ్యర్థుల పేర్లను మాత్రమే పరిగణనలోకి తీసుకోవాలని రాజకీయ పార్టీల ప్రతినిధులు కలెక్టర్‌ను కోరారు.

# స్థానిక ఎన్నికల ఏర్పాట్లను పరిశీలించిన అబ్జర్వర్, కలెక్టర్

## చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్‌లో నామినేషన్ ప్రక్రియ తనిఖీ

## సీసీటీవీలు, నామినేషన్ కౌంటర్లు, సిబ్బంది వివరాల పరిశీలన

## ఎన్నికలు పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించాలని అధికారులకు సూచన







చిత్తూరు, అక్టోబర్ 18: (మహి న్యూస్): స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్‌లో ఎన్నికల ఏర్పాట్లను జిల్లా ఎన్నికల అబ్జర్వర్, సీఎండీ ఎల్. శివశంకర్, జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సుమిత్ కుమార్, జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్ పరిశీలించారు. నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను క్షేత్రస్థాయిలో తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సీసీటీవీ కెమెరాల పనితీరు, నామినేషన్ల స్వీకరణ, నామినేషన్ కౌంటర్ల నిర్వహణ, ఎన్నికల విధుల్లో ఉన్న సిబ్బంది వివరాలు, ఎన్నికల నిర్వహణకు చేపట్టిన ఏర్పాట్లను పరిశీలించారు. ఎన్నికల ప్రక్రియను నిష్పక్షపాతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ నరసింహ ప్రసాద్, సహాయ ఎన్నికల అధికారి, తహసీల్దార్, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

# కోడూరు నియోజకవర్గంలో ఓట్ల లెక్కింపు ఏర్పాట్లను పరిశీలించిన జాయింట్ కలెక్టర్

## స్ట్రాంగ్ రూమ్‌లు, కౌంటింగ్ కేంద్రాల్లో పటిష్ట భద్రత కల్పించాలి

## అవసరమైన మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయాలి

## అధికారులకు ఆదేశాలు జారీ చేసిన జేసీ ఆర్. గోవిందరావు





కోడూరు, అక్టోబర్ 18: (మహి న్యూస్): స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా కోడూరు నియోజకవర్గ పరిధిలో ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల ఓట్ల లెక్కింపు కోసం చేపడుతున్న ఏర్పాట్లను జిల్లా జాయింట్ కలెక్టర్ ఆర్. గోవిందరావు ఆదివారం పరిశీలించారు. కోడూరు హార్టికల్చర్ యూనివర్సిటీలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌లు, కౌంటింగ్ కేంద్రాలను తిరుపతి ఆర్డీఓ రామ్మోహన్‌తో కలిసి పరిశీలించారు. ఎన్నికల బ్యాలెట్ బాక్సులను భద్రపరిచే స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద, ఓట్ల లెక్కింపు కేంద్రాల్లో పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని, ఓట్ల లెక్కింపు ప్రక్రియ సజావుగా జరిగేలా ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. స్ట్రాంగ్ రూమ్‌లు, కౌంటింగ్ కేంద్రాల వద్ద చేపట్టాల్సిన ఏర్పాట్లపై సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో కోడూరు తహశీల్దార్ అమర్నాథ్‌తో పాటు నియోజకవర్గ పరిధిలోని ఇతర మండలాల తహశీల్దార్లు, ఎంపీడీవోలు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# నామినేషన్ కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన

## - జనరల్ అబ్జర్వర్ ఎం. వరప్రసాద్

## తిరుపతి నగరంలో పలు వార్డుల నామినేషన్ కేంద్రాల పరిశీలన

## భద్రత, అభ్యర్థులకు కల్పిస్తున్న సౌకర్యాలపై సమీక్ష

## అధికారులకు పలు సూచనలు



తిరుపతి, అక్టోబర్ 18: (మహి న్యూస్): తిరుపతి నగరపాలక సంస్థ ఎన్నికల నామినేషన్ల స్వీకరణలో భాగంగా మూడో రోజు నామినేషన్ కేంద్రాలను జనరల్ అబ్జర్వర్ ఎం. వరప్రసాద్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. కేంద్రాల్లో నామినేషన్ల దాఖలు ప్రక్రియ, భద్రతా ఏర్పాట్లు, అభ్యర్థులకు కల్పిస్తున్న సౌకర్యాలను క్షుణ్ణంగా పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. నామినేషన్ కేంద్రాలకు సంబంధించిన వివరాలను నగరపాలక సంస్థ కమిషనర్ ఎం. జయకృష్ణ అబ్జర్వర్‌కు వివరించారు.



అబ్జర్వర్ తనిఖీ చేసిన కేంద్రాలు:
న్యూ మారుతి నగర్ -- 22వ వార్డు.
కెనడి నగర్ -- 12వ వార్డు.
రైల్వే కాలనీ -- 35వ వార్డు.
స్పోర్ట్స్ కాంప్లెక్స్ -- 10వ వార్డు.
జీవకోన, సత్యనారాయణపురం - 49, 50వ వార్డులు.
తిరుమల రెడ్డి నగర్ -- 1వ వార్డు.
నగరపాలక సంస్థ మేయర్ నామినేషన్ కేంద్రం.

ఈ తనిఖీల్లో అదనపు కమిషనర్ శారదా దేవి, డిప్యూటీ కమిషనర్ అమరయ్య, లైజనింగ్ ఆఫీసర్ రాజు తదితరులు పాల్గొన్నారు.

# చిత్తూరు జిల్లాలో స్థానిక ఎన్నికలకు పటిష్ట భద్రత

## ఎన్నికల ఏర్పాట్లపై సాధారణ పరిశీలకుడు ఎల్. శివశంకర్ సమీక్ష

## సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక ప్రాంతాల్లో స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్స్‌తో అదనపు బందోబస్తు

## 1,236 పోలింగ్ కేంద్రాల గుర్తింపు.. భద్రత విధుల్లో సుమారు 2,000 మంది పోలీసులు

## నగదు, మద్యం రవాణాపై ప్రత్యేక నిఘా



చిత్తూరు, అక్టోబర్ 18: (మహి న్యూస్): చిత్తూరు జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికలను ప్రశాంతంగా, స్వేచ్ఛగా, పారదర్శకంగా నిర్వహించేందుకు పటిష్టమైన ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నియమించిన సాధారణ ఎన్నికల పరిశీలకుడు, సీఎండీ ఎల్. శివశంకర్ అధికారులకు సూచించారు. ఆదివారం కలెక్టరేట్‌లోని నాగార్జున ఐఏఎస్ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, జిల్లా ఎస్పీ తుషార్ డూడితో కలిసి వివిధ శాఖల అధికారులతో ఎన్నికల ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. ఎన్నికల సమయంలో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక ప్రాంతాలను ముందుగానే గుర్తించి అదనపు బలగాలతో భద్రత కల్పించాలని శివశంకర్ సూచించారు. నామినేషన్, పోలింగ్, కౌంటింగ్ కేంద్రాల్లో వీడియో చిత్రీకరణతో పాటు సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బందికి శిక్షణ ఇవ్వాలని తెలిపారు. అర్హులైన ప్రతి ఓటరు తమ ఓటు హక్కును వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు చేపట్టినట్లు తెలిపారు. నగరపాలక సంస్థలు, పురపాలక సంఘాల్లోని 168 వార్డులకు ఈ నెల 28న పోలింగ్, 30న ఓట్ల లెక్కింపు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఎన్నికల సిబ్బందికి తొలి విడత శిక్షణ పూర్తయిందని, ఈ నెల 23 నుంచి 25వ తేదీ మధ్య రెండో విడత శిక్షణ నిర్వహిస్తామని చెప్పారు. ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించి పరిష్కరించేందుకు కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు.



### జిల్లాలో ఎన్నికల ఏర్పాట్ల వివరాలు:

1ఒ. జిల్లాలో 4 రెవెన్యూ డివిజన్లు, 27 మండలాలు, 622 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. మొత్తం 370 ఎంపీటీసీ స్థానాలు, 27 జెడ్పీటీసీ స్థానాలు ఉన్నాయి.

2ఒ. గ్రామీణ ప్రాంత జనాభా 12,90,810 కాగా, మొత్తం ఓటర్లు 10,26,821 మంది ఉన్నారు. వీరిలో పురుషులు 5,07,703 మంది, మహిళలు 5,19,091 మంది, ఇతరులు 27 మంది ఉన్నారు.

3ఒ. జిల్లా వ్యాప్తంగా 1,236 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. వీటిలో 524 సాధారణ, 366 సున్నితమైన, 346 అత్యంత సున్నితమైన కేంద్రాలుగా గుర్తించారు.

4ఒ. ఎన్నికల కోసం 2,616 పెద్ద బ్యాలెట్ పెట్టెలు, 2,113 చిన్న బ్యాలెట్ పెట్టెలు సిద్ధం చేశారు. ఇప్పటికే 2,472 పెద్ద బ్యాలెట్ పెట్టెలను మండలాలకు పంపిణీ చేశారు.

5ఒ. 27 మండలాలకు రిటర్నింగ్ అధికారులు, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు నియమించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలును పర్యవేక్షించేందుకు ప్రతి మండలంలో ఎంసీసీ బృందం, ఫ్లయింగ్ స్క్వాడ్, స్టాటిక్ సర్వైలెన్స్ టీమ్ ఏర్పాటు చేశారు.

6ఒ. పోలింగ్ విధుల కోసం 4,126 మంది ప్రిసైడింగ్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులను నియమించారు. వారికి శిక్షణ ఇచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

చిత్తూరు, కుప్పం, నగరి, పలమనేరు ప్రాంతాల్లో స్ట్రాంగ్ రూమ్‌లు, ఓట్ల లెక్కింపు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. చిత్తూరులోని పి.వి.కె.ఎన్. డిగ్రీ కళాశాల, సీటమ్స్ ఇంజినీరింగ్ కళాశాల, కుప్పంలోని ప్రభుత్వ ఒకేషనల్ కళాశాల, నగరిలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల, పలమనేరులోని ఎస్.వి.సి.ఆర్. కళాశాల, టి.కె.సి. జూనియర్ కళాశాలల్లో అవసరమైన ఏర్పాట్లు చేపట్టినట్లు వివరించారు. జిల్లా ఎస్పీ తుషార్ డూడి మాట్లాడుతూ స్థానిక ఎన్నికల భద్రత కోసం సుమారు 2,000 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక ప్రాంతాల్లో స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్స్‌తో అదనపు భద్రత కల్పిస్తున్నట్లు చెప్పారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే అవకాశం ఉన్నవారిని గుర్తించి కొందరిపై బైండోవర్ కేసులు నమోదు చేసినట్లు వెల్లడించారు. పెండింగ్‌లో ఉన్న నాన్ బెయిలబుల్ వారెంట్ల అమలుకు చర్యలు చేపట్టామని, పొరుగు రాష్ట్రాల అధికారులతో సమన్వయం చేసుకుంటూ సరిహద్దు చెక్‌పోస్టుల వద్ద తనిఖీలు ముమ్మరం చేస్తామని ఎస్పీ తెలిపారు. నగదు, మద్యం రవాణాతో పాటు ఇతర ప్రాంతాల నుంచి ప్రచారం కోసం వచ్చే వ్యక్తులపై ప్రత్యేక నిఘా ఉంచినట్లు చెప్పారు. సీసీ కెమెరాలు, డ్రోన్లు, తాత్కాలిక చెక్‌పోస్టుల ద్వారా తనిఖీలు నిర్వహిస్తామని వివరించారు. ఈ సమావేశంలో జెడ్పీ సీఈఓ రవికుమార్ నాయుడు, డీపీఓ సుధాకర్ బాబు, డీఎల్‌డీఏ రవి, డీఆర్‌డీఏ ఏపీడీ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.



# గ్రీన్‌ప్యానెల్ ఇండస్ట్రీస్‌లో 36 ఉద్యోగాలకు ప్రత్యక్ష ఇంటర్వ్యూలు

## ఐటీఐ నుంచి బీటెక్ వరకు విద్యార్హతలున్న వారికి అవకాశం

## పోస్టును బట్టి ఏడాదికి రూ.2.10 లక్షల నుంచి రూ.7 లక్షల వరకు వేతనం

## అక్టోబర్ 22న శ్రీకాళహస్తిలో ఇంటర్వ్యూలు

## నైపుణ్యం పోర్టల్‌లో ముందస్తు నమోదు తప్పనిసరి

తిరుపతి, అక్టోబర్ 18: (మహి న్యూస్): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ (ఏపీఎస్ఎస్‌డీసీ) ఆధ్వర్యంలో స్కిల్ కనెక్ట్ డ్రైవ్‌లో భాగంగా గ్రీన్‌ప్యానెల్ ఇండస్ట్రీస్ లిమిటెడ్‌లో 36 ఉద్యోగాల భర్తీకి ప్రత్యక్ష ఇంటర్వ్యూలు నిర్వహించనున్నారు. తిరుపతి జిల్లా, పరిసర ప్రాంతాల్లోని నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఆర్. లోకనాథం తెలిపారు. మిషినిస్ట్ సాంకేతిక నిపుణులు, వెల్డర్లు, రిగ్గర్లు, విద్యుత్ సాంకేతిక నిపుణులు, సహాయకులు, విద్యుత్ ఆటోమేషన్ అసిస్టెంట్ మేనేజర్లు, లాజిస్టిక్స్ సూపర్‌వైజర్లు, కెమిస్టులు, గ్రాడ్యుయేట్ ఇంజినీర్ ట్రైనీ పోస్టులకు ఖాళీలు ఉన్నాయి. ఫ్రెషర్లతో పాటు సంబంధిత రంగాల్లో 2 నుంచి 10 సంవత్సరాల అనుభవం ఉన్నవారికి కూడా పోస్టులను బట్టి అవకాశం కల్పించనున్నారు.

### అర్హతలు, వేతన వివరాలు

విద్యార్హతలు: ఐటీఐ ఫిట్టర్, ఐటీఐ ఎలక్ట్రికల్, ఇంటర్మీడియట్, డిప్లొమా, ఏదైనా డిగ్రీ, బీఎస్సీ కెమిస్ట్రీ, బీటెక్ ఈసీఈ, ఈఈఈ, మెకానికల్.

మొత్తం ఖాళీలు: 36

వేతనం: ఏడాదికి రూ.2.10 లక్షల నుంచి రూ.7 లక్షల వరకు.

వయస్సు: 20 నుంచి 35 సంవత్సరాలు.

అర్హులు: పురుష అభ్యర్థులు మాత్రమే.

ఇంటర్వ్యూ వివరాలు

తేదీ: అక్టోబర్ 22, గురువారం

సమయం: ఉదయం 8:30 గంటల నుంచి

వేదిక: గ్రీన్‌ప్యానెల్ ఇండస్ట్రీస్ లిమిటెడ్, సర్వే నంబర్లు 97/1, 98/1, 99/1, రౌతుసురమాల, తొట్టంబేడు మండలం, శ్రీకాళహస్తి, తిరుపతి జిల్లా.

ఆన్‌లైన్ నమోదు తప్పనిసరి

ఇంటర్వ్యూకు హాజరయ్యే అభ్యర్థులు ముందుగా నైపుణ్యం పోర్టల్‌లో తమ వివరాలను నమోదు చేసుకోవాలి.

వెబ్‌సైట్: naipunyam.ap.gov.in

సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు: 9000109045, 6303578886, 9988853335. అర్హత కలిగిన నిరుద్యోగ యువత ఈ ఉద్యోగ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఆర్. లోకనాథం కోరారు.




| S.no | Job Role | Qualification | Salary | Vacancies | Gender | Age Group | Exp Required |
|---|---|---|---|---|---|---|---|
| 1 | Technicians - Machinist, Welder, Rigeer | ITI - Fitter | 04-07 LPA | 4 | Male | 25-30 | 07 - 10 Yrs Experience |
| 2 | Electrical - Technicain | ITI - Electrical | 2.10 to 03 LPA | 3 | Male | 25-30 | 2-05 Yrs |
| 3 | Assistant - Quality | Intermediate/ Any Degree | 2.10 to 2.5 LPA | 2 | Male | 19-22 | Fresher or 01 Yr Exp. |
| 4 | Chemist- Quality | B.sc - Chemistry | 2.10 to 2.5 LPA | 1 | Male | 19-22 | Fresher or 01 Yr Exp. |
| 5 | Chemist - Resin Opertations | B.sc - Chemistry | 2.25 LPA | 3 | Male | 20-25 | Fresher |
| 6 | Supervsior- Resin Opertations | B.sc - Chemistry | 5-07 LPA | 1 | Male | 25-30 | Min 05 Yrs Exp |
| 7 | Graduate Engineer Trainee | Diploma / B.Tech - Mechanical | 2.75 LPA | 7 | Male | 20-25 | Fresher |
| 8 | Production - Operator | Any Degree | 2.10 to 2.5 LPA | 3 | Male | 19-22 | Fresher or 01 Yr Exp. |
| 9 | Operator - Chipper | Intermediate/ Any Degree | 2.10 to 2.5 LPA | 2 | Male | 19-22 | Fresher or 01 Yr Exp. |
| 10 | Supervsior- Logistics/Dispatch | Any Degree | 2.50 to 3.5 LPA | 10 | Male | 20-25 | Min 02 to 05 Yrs Exp |
| | | | Total Vacancies | 36 | | | |



# చిత్తూరు జిల్లాలో మూడు మున్సిపాలిటీల్లో 715 నామినేషన్లు

## కుప్పంలో 282, పలమనేరులో 150, నగరిలో 283 నామినేషన్లు

## మూడు మున్సిపాలిటీల్లో చైర్మన్ అభ్యర్థిత్వానికి 39 నామినేషన్లు

## అక్టోబర్ 16 నుంచి 18 వరకు కొనసాగిన నామినేషన్ల స్వీకరణ

చిత్తూరు, అక్టోబర్ 18: (మహి న్యూస్): చిత్తూరు జిల్లాలోని కుప్పం, పలమనేరు, నగరి మున్సిపాలిటీల్లో స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ఆదివారంతో ముగిసింది. అక్టోబర్ 16 నుంచి 18 వరకు మూడు రోజుల పాటు జరిగిన ప్రక్రియలో ఈ మూడు మున్సిపాలిటీల్లో కలిపి 715 నామినేషన్లు దాఖలయ్యాయి.

### కుప్పం మున్సిపాలిటీ

32 వార్డులు ఉన్న కుప్పం మున్సిపాలిటీలో మొత్తం 282 నామినేషన్లు దాఖలయ్యాయి. చైర్మన్ అభ్యర్థిత్వానికి 18 నామినేషన్లు వచ్చాయి.

చైర్మన్ అభ్యర్థుల నామినేషన్లు: టీడీపీ -- 6, వైఎస్సార్‌సీపీ -- 8, బీఎస్పీ -- 1, కాంగ్రెస్ -- 1, స్వతంత్రులు -- 2.

కౌన్సిలర్ అభ్యర్థుల నామినేషన్లు: టీడీపీ -- 146, వైఎస్సార్‌సీపీ -- 99, జనసేన -- 13, బీజేపీ -- 2, స్వతంత్రులు -- 22.

పలమనేరు మున్సిపాలిటీ

36 వార్డులు ఉన్న పలమనేరు మున్సిపాలిటీలో మొత్తం 150 నామినేషన్లు దాఖలయ్యాయి. చైర్మన్ అభ్యర్థిత్వానికి 7 నామినేషన్లు వచ్చాయి.

చైర్మన్ అభ్యర్థుల నామినేషన్లు: టీడీపీ -- 3, వైఎస్సార్‌సీపీ -- 3, కాంగ్రెస్ -- 1.

కౌన్సిలర్ అభ్యర్థుల నామినేషన్లు: టీడీపీ -- 69, వైఎస్సార్‌సీపీ -- 62, జనసేన -- 6, బీజేపీ -- 3, స్వతంత్రులు -- 6, ఇతరులు -- 4.

నగరి మున్సిపాలిటీ

40 వార్డులు ఉన్న నగరి మున్సిపాలిటీలో మొత్తం 283 నామినేషన్లు దాఖలయ్యాయి. చైర్మన్ అభ్యర్థిత్వానికి 14 నామినేషన్లు వచ్చాయి.

చైర్మన్ అభ్యర్థుల నామినేషన్లు: టీడీపీ -- 3, వైఎస్సార్‌సీపీ -- 10, స్వతంత్రులు -- 1.

కౌన్సిలర్ అభ్యర్థుల నామినేషన్లు: టీడీపీ -- 121, వైఎస్సార్‌సీపీ -- 130, జనసేన -- 3, బీజేపీ -- 6, స్వతంత్రులు -- 19, కాంగ్రెస్ -- 1, బీఎస్పీ -- 1, సీపీఐ -- 2.చిత్తూరు నగరపాలక సంస్థకు సంబంధించిన మేయర్, డివిజన్ల వారీ నామినేషన్ల వివరాలను టౌన్ ప్లానింగ్ అధికారి తర్వాత వెల్లడించనున్నారు.

# కుకునూరు జడ్పీటీసీ బరిలో బొంతు కోమల

## టీడీపీ తరపున జడ్పీటీసీ అభ్యర్థిగా పోటీకి సిద్ధం



కుకునూరు: 18, అక్టోబర్ : స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ఏలూరు జిల్లా కుకునూరు మండలంలో రాజకీయ పరిణామాలు ఆసక్తికరంగా మారుతున్నాయి. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కుకునూరు మండల జడ్పీటీసీ స్థానానికి తెలుగుదేశం పార్టీ తరపున బొంతు కోమల పోటీ చేయనున్నట్లు సమాచారం. జడ్పీటీసీ ఎన్నికల నేపథ్యంలో మండలంలో రాజకీయ చర్చలు ఊపందుకుంటున్నాయి. తెలుగుదేశం పార్టీ తరపున బొంతు. కోమల బరిలోకి దిగనున్నారనే విషయం స్థానిక రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. మండల అభివృద్ధి, ప్రజా సమస్యలు, గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పన వంటి అంశాలు స్థానిక సంస్థల ఎన్నికల్లో కీలకంగా నిలవనున్నాయి. ఎన్నికల షెడ్యూల్, పార్టీ అధికారిక ప్రకటన, అభ్యర్థిత్వానికి సంబంధించిన తదుపరి పరిణామాలపై స్థానికంగా ఆసక్తి నెలకొంది.

# కుకునూరులో టీడీపీకి భారీ ఊపు

## వైసీపీ నుంచి తెలుగుదేశం పార్టీలో జాయిన్ అయిన కుకునూరు వైసీపీ మాజీ ఎంపీపీ చేబ్రోలు గీతా వాణి

కుకునూరు : 18, అక్టోబర్ : కుకునూరు తెలుగుదేశం మండల పార్టీ అధ్యక్షులు ములిశెట్టి. నాగేశ్వరరావు ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీకి భారీ చేరికలు లభించాయి. ఏలూరు జిల్లా టీడీపీ స్థానిక సంస్థల ఎన్నికల పరిశీలకురాలు, ఎమ్మెల్సీ పంచుమట్ల. అనురాధ పోలవరం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ట్రైకార్ చైర్మన్ బొరగం. శ్రీనివాసులు సమక్షంలో వైఎస్ఆర్‌సీపీ పార్టీకి చెందిన సుమారు 300 పైగా కుటుంబాలు టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా నాయకులు వారికి పసుపు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ముందుగా కార్యక్రమానికి విచ్చేసిన ముఖ్య నాయకులకు మండల సరిహద్దు నుండి కుకు నూరు వరకు పార్టీ శ్రేణులు, కార్యకర్తలు భారీ బైక్ ర్యాలీతో ఘనంగా స్వాగతం పలికారు. దారిపొడవునా పసుపు జెండాల హోరుతో, నాయకుల నినాదాలతో కుకు నూరు పరిసర ప్రాంతాలు మార్మోగాయి తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై ప్రజలు, వివిధ పార్టీల నాయకులు టీడీపీ వైపు మొగ్గు చూస్తున్నారని తెలిపారు. ఎమ్మెల్సీ పంచుమట్ల.అనురాధ, ట్రైకార్ చైర్మన్ బొరగం. శ్రీనివాసులు కుకునూరు మండలంలో టీడీపీ బలోపేతానికి కార్యకర్తలందరూ ఐక్యంగా కృషి చేయాలని, చేరిన ప్రతి ఒక్కరికీ పార్టీలో తగిన గుర్తింపు లభిస్తుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మండల స్థాయి నాయకులు, కార్యకర్తలు, గ్రామాల్లోని తెలుగుదేశం అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

EDITOR and PUBLISHER and OWNED BY NEELI RAMASUBBAIAH, PUBLISHED 9147/1, SRI LAKSHMI NARASIMHA YOGIMAILAVARAM ARCH ROAD, YOGIMAILAVARAM,TIRUPATHI,AP - 517503.A.P .VSAR PUBLICATIONSDOOR NO. 403, PANTA STREET, TIRUPATHI - 517501.RNI NO : APTEL/26/A5325. Cell 90 59 58 58 98. Email : mahinewsindia@gmail.com, website : https//epaper.mahinewsindia.com

RNI : APTEL/25/A0108
మహి న్యూస్
www.mahinewsindia.com
epaper: https://epaper.mahinewsindia.com
తెలుగు దినపత్రిక


# స్థానిక సంస్థల ఎన్నికల పర్యవేక్షణకు కర్నూలు జిల్లాకు చేరుకున్న అబ్జర్వర్లు

### జనరల్ అబ్జర్వర్‌గా బి. అనిల్ కుమార్ రెడ్డి, ఐఏఎస్
### ఎక్స్‌పెండిచర్ అబ్జర్వర్‌గా కె. బాలరాజు, ఐఎఫ్ఎస్
### ఎన్నికలకు సంబంధించిన అంశాలపై ఫోన్ ద్వారా సంప్రదించవచ్చు



కర్నూలు, అక్టోబర్ 18: (మహి న్యూస్): స్థానిక సంస్థల ఎన్నికల పర్యవేక్షణ కోసం రాష్ట్ర ఎన్నికల సంఘం కర్నూలు జిల్లాకు ఇద్దరు అబ్జర్వర్లను నియమించింది. జనరల్ అబ్జర్వర్‌గా బి. అనిల్ కుమార్ రెడ్డి, ఐఏఎస్, ఎక్స్‌పెండిచర్ అబ్జర్వర్‌గా కె. బాలరాజు, ఐఎఫ్ఎస్‌లను నియమించింది. రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు వీరు ఆదివారం ఉదయం కర్నూలు జిల్లాకు చేరుకున్నారు. ఎన్నికలకు సంబంధించిన అంశాలపై అబ్జర్వర్లను సంప్రదించేందుకు ఫోన్ నంబర్లను జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి వెల్లడించారు. జనరల్ అబ్జర్వర్ బి. అనిల్ కుమార్ రెడ్డి, ఐఏఎస్ -- 98499 00961 ఎక్స్‌పెండిచర్ అబ్జర్వర్ కె. బాలరాజు, ఐఎఫ్ఎస్ -- 94408 10073 ఎన్నికలకు సంబంధించిన ఫిర్యాదులు, ఇతర అంశాలపై పై ఫోన్ నంబర్ల ద్వారా అబ్జర్వర్లను సంప్రదించవచ్చని జిల్లా కలెక్టర్ ఒక ప్రకటనలో తెలిపారు.

# ఎన్నికల ప్రక్రియపై పూర్తి అవగాహన ఉండాలి

### జిల్లా జనరల్ అబ్జర్వర్ బి. అనిల్ కుమార్ రెడ్డి, ఐఏఎస్
### ఎన్నికల విధులు, బాధ్యతలను మార్గదర్శకాల ప్రకారం నిర్వహించాలి
### పోలింగ్ సామగ్రి వినియోగంలో అప్రమత్తంగా ఉండాలి

కర్నూలు, అక్టోబర్ 18: (మహి న్యూస్): ఎన్నికల నిర్వహణ ప్రక్రియ, విధులు, బాధ్యతలపై సంబంధిత సిబ్బంది పూర్తి అవగాహన కలిగి ఉండాలని జిల్లా జనరల్ అబ్జర్వర్ బి. అనిల్ కుమార్ రెడ్డి, ఐఏఎస్ సూచించారు. ఆదివారం ప్రభుత్వ జూనియర్ కళాశాల (టౌన్)లో ప్రిసైడింగ్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులకు నిర్వహిస్తున్న శిక్షణ తరగతులను, వెంకటరమణ కాలనీలోని నగరపాలక సంస్థ కార్యాలయంలో మేయర్ స్థాన ఎన్నికల రిటర్నింగ్ అధికారి కార్యాలయాన్ని, ఇందిరాగాంధీ నగర్‌లోని 59, 60, 61 వార్డుల రిటర్నింగ్ అధికారి కార్యాలయాల్లో నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసుతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా అనిల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ, ప్రిసైడింగ్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులు ఎన్నికల సంఘం హ్యాండ్‌బుక్‌లోని మార్గదర్శకాలను పూర్తిగా తెలుసుకొని విధులు సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. ఎన్నికల నిర్వహణలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని, శిక్షణలో వివరించిన అంశాలపై పూర్తి అవగాహన పెంచుకోవాలని తెలిపారు. నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు మాట్లాడుతూ, ఎన్నికల మార్గదర్శకాల ప్రకారం విధులు నిర్వహిస్తూ పోలింగ్ ప్రక్రియలో ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అథెనా స్కూల్‌లో బ్యాలెట్ బాక్సులను స్వీకరించినప్పటి నుంచి పోలింగ్ కేంద్రాల్లో వినియోగించి తిరిగి అప్పగించే వరకు అత్యంత అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ఎన్నికల సామగ్రి వినియోగం, పోలింగ్ నిర్వహణ, ఎన్నికల విధివిధానాలపై పూర్తి అవగాహనతో బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని పేర్కొన్నారు. ఎన్నికల ప్రక్రియలో పారదర్శకతకు ప్రాధాన్యతనిస్తూ, సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. అంతకుముందు రాష్ట్ర ప్రభుత్వ అతిథి గృహంలో జిల్లా జనరల్ అబ్జర్వర్ బి. అనిల్ కుమార్ రెడ్డిని కమిషనర్ చల్లా ఓబులేసు పుష్పగుచ్ఛంతో స్వాగతించి, ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లపై చర్చించారు. ఈ కార్యక్రమంలో మేయర్ స్థాన ఎన్నికల రిటర్నింగ్ అధికారి కె. వేణుగోపాల్, 59, 60, 61 వార్డుల రిటర్నింగ్ అధికారి ఐ.డి. శిరీష తదితరులు పాల్గొన్నారు.







# కల్లూరు అర్బన్ 34వ వార్డులో టీడీపీలో చేరిన వైసీపీ యువ నాయకులు

### గౌరు చరిత రెడ్డి సమక్షంలో టీడీపీలో చేరిక
### పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించిన గౌరు దంపతులు







కర్నూలు, అక్టోబర్ 18: (మహి న్యూస్): కల్లూరు అర్బన్ 34వ వార్డుకు చెందిన వైఎస్సార్‌సీపీ ముఖ్య నాయకులు, యువకులు ఎం.ఎం. రెడ్డి, అయ్యప్ప నాయుడు, పరమేష్, హనుమంత్ వైఎస్సార్‌సీపీని వీడి గౌరు చరిత రెడ్డి సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. ఈ సందర్భంగా గౌరు దంపతులు వారికి టీడీపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఓర్వకల్లు మండల అధ్యక్షుడు బ్రాహ్మణపల్లె నాగిరెడ్డి, రామిరెడ్డి, విశ్వనాథ్, జంపాల జగదీష్, అనిల్, సర్దార్, సుంకన్న, రవి, గోపి తదితరులు పాల్గొన్నారు.

# వైసీపీకి భారీ షాక్.. టీడీపీలో చేరిన 40 కుటుంబాలు

### ఉప్పలపాడు గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ, వైసీపీ గ్రామ అధ్యక్షుడు పింజరి దస్తగిరి చేరిక
### గౌరు చరిత వెంకట రెడ్డి దంపతుల సమక్షంలో టీడీపీలో చేరిన నాయకులు, కుటుంబాలు
### పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించిన గౌరు దంపతులు








కర్నూలు, అక్టోబర్ 18: (మహి న్యూస్): ఓర్వకల్లు మండలం ఉప్పలపాడు గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ మాజీ ఎంపీటీసీ, గ్రామ అధ్యక్షుడు పింజరి దస్తగిరితో పాటు 40 కుటుంబాలు వైఎస్సార్‌సీపీని వీడి తెలుగుదేశం పార్టీలో చేరాయి. కర్నూలులోని మాధవి నగర్ క్యాంపు కార్యాలయంలో గౌరు చరిత వెంకట రెడ్డి దంపతుల సమక్షంలో ఈ చేరికలు జరిగాయి. ఈ సందర్భంగా గౌరు దంపతులు పార్టీలో చేరిన వారికి టీడీపీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించి శుభాకాంక్షలు తెలిపారు. పార్టీలో చేరిన వారిలో నాగప్ప, ఉసేన్, రఫీ, మభు హుస్సేన్, మహేష్, మాలిక్ భాష, కురువ లక్ష్మన్న, పి. మా భాష, సామన్న, ఆటో ఉసేన్, మత్తయ్య, గణపురం నాగప్ప తదితరులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో ఓర్వకల్లు మండల అధ్యక్షుడు బ్రాహ్మణపల్లె నాగిరెడ్డి, గుట్టపాడు మాజీ సర్పంచ్ మోహన్ రెడ్డి, నన్నూరు సొసైటీ చైర్మన్ నాగేశ్వర రెడ్డి, ఉప్పలపాడు గ్రామ నాయకులు సుబ్బారెడ్డి, మాజీ సర్పంచ్ అయ్య స్వామి, నవ్యాంధ్ర విద్యార్థి విభాగం అధ్యక్షుడు అయ్య స్వామి, బుడ్డ భాష తదితరులు పాల్గొన్నారు.

# కుమ్మర శాలివాహనుల తొలి అడుగు.. నామినేషన్లు దాఖలు

### 33వ వార్డులో జనసేన తరఫున కె. పావని నామినేషన్
### టీడీపీ తరఫున కె. నరసింహ బాబు, వైఎస్సార్‌సీపీ తరఫున చిట్టి బాబు నామినేషన్లు



కర్నూలు, అక్టోబర్ 18: (మహి న్యూస్): కర్నూలు నగరపాలక సంస్థ ఎన్నికల్లో కుమ్మర శాలివాహన సామాజిక వర్గానికి చెందిన అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. ముందుగా నిర్ణయించిన ప్రకారం శనివారం నామినేషన్ల ప్రక్రియలో పాల్గొనగా, కొన్ని రాజకీయ సమీకరణాల కారణంగా అభ్యర్థుల్లో స్వల్ప మార్పులు చోటుచేసుకున్నాయి. 33వ వార్డులో జనసేన పార్టీ తరఫున పి.బి.వి. సుబ్బయ్యకు బదులుగా ఆయన కోడలు కె. పావని నామినేషన్ దాఖలు చేశారు. టీడీపీ తరఫున కె. నరసింహ బాబు, వైఎస్సార్‌సీపీ తరఫున చిట్టి బాబు నామినేషన్లు సమర్పించారు. ముగ్గురు అభ్యర్థులకు శాలివాహన సంక్షేమ సంఘం కర్నూలు జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్ శుభాకాంక్షలు తెలిపారు. పార్టీలకు అతీతంగా సామాజిక వర్గానికి చెందిన అభ్యర్థులకు మద్దతు ఇచ్చి గెలిపించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.



# సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక రద్దు

### స్థానిక సంస్థల ఎన్నికలు, మహర్నవమి పండుగ సందర్భంగా ప్రభుత్వ సెలవు
### కలెక్టరేట్‌తో పాటు డివిజన్, మండల స్థాయిలోనూ పీజీఆర్ఎస్ ఉండదు
### జిల్లా ప్రజలు గమనించాలి: కలెక్టర్ డా. ఏ. సిరి

కర్నూలు, అక్టోబర్ 18: (మహి న్యూస్): స్థానిక సంస్థల ఎన్నికలు, మహర్నవమి పండుగ సందర్భంగా అక్టోబర్ 19వ తేదీ సోమవారం ప్రభుత్వ సెలవు ఉన్నందున ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమం నిర్వహించబోమని జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి తెలిపారు. కర్నూలు కలెక్టరేట్‌తో పాటు డివిజన్, మండల స్థాయిల్లో కూడా పీజీఆర్ఎస్ కార్యక్రమం ఉండదని ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. ఈ విషయాన్ని జిల్లా ప్రజలు గమనించాలని, ఫిర్యాదులు, అర్జీలు సమర్పించేందుకు సోమవారం కలెక్టరేట్‌కు ఎవరూ రావద్దని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

# నంద్యాలలో ఎన్నికల అబ్జర్వర్లను కలిసిన జిల్లా కలెక్టర్, డీఆర్ఓ







నంద్యాల, అక్టోబర్ 18: (మహి న్యూస్): నంద్యాల పట్టణంలోని రాష్ట్ర ప్రభుత్వ అతిథి గృహంలో స్థానిక సంస్థల ఎన్నికల పర్యవేక్షణ జనరల్ అబ్జర్వర్ జె. వెంకట మురళి, ఐఏఎస్‌ను జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పూల మొక్కను అందజేశారు. అలాగే ఎన్నికల ఎక్స్‌పెండిచర్ అబ్జర్వర్ పి. శ్యామల, ఐఎఫ్ఎస్‌ను జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా, జిల్లా రెవెన్యూ అధికారి రామునాయక్ వేర్వేరుగా కలిసి పూల మొక్కలను అందజేశారు. ఎన్నికల పర్యవేక్షణ కోసం జిల్లాకు చేరుకున్న అబ్జర్వర్లను వారు కలిశారు.

# నంద్యాలలో ఎన్నికల ఏర్పాట్లపై సమీక్ష

### ఎన్నికల సంసిద్ధత, ఏర్పాట్ల పురోగతిపై అధికారుల సమీక్ష




నంద్యాల, అక్టోబర్ 18: (మహి న్యూస్): నంద్యాల కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో స్థానిక సంస్థల ఎన్నికల సంసిద్ధత, ఇప్పటివరకు చేపట్టిన ఏర్పాట్ల పురోగతిపై ఎన్నికల జనరల్ అబ్జర్వర్ జె. వెంకట మురళి, ఎక్స్‌పెండిచర్ అబ్జర్వర్ పి. శ్యామల సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా ఎన్నికల ఏర్పాట్లు, ఇప్పటివరకు తీసుకున్న చర్యలకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. ఈ సమీక్షలో జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్, అడిషనల్ ఎస్పీ ఖాదర్ బాషా, సబ్ కలెక్టర్ మనీషా, సంబంధిత ఎన్నికల అధికారులు పాల్గొన్నారు.

# కర్నూలులో మున్సిపల్ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ ప్రశాంతం

### చివరి రోజు నామినేషన్ కేంద్రాలను తనిఖీ చేసిన ఎస్పీ విక్రాంత్ పాటిల్
### సమస్యాత్మక, హైపర్ సెన్సిటివ్ కేంద్రాల్లో భద్రతపై సమీక్ష
### ఎన్నికల నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు



కర్నూలు, అక్టోబర్ 18: (మహి న్యూస్): కర్నూలు నగరంలో మున్సిపల్ ఎన్నికల నామినేషన్ల స్వీకరణ చివరి రోజు ఆదివారం ప్రక్రియ ప్రశాంతంగా ముగిసింది. ఈ సందర్భంగా కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్ నగరంలో విస్తృతంగా పర్యటించి నామినేషన్ కేంద్రాలు, పోలింగ్ కేంద్రాల వద్ద భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. ముందుగా ఆరోరా నగర్‌లో ఏర్పాటు చేసిన రెండు నామినేషన్ కేంద్రాలను తనిఖీ చేసి, భద్రతా ఏర్పాట్లపై పోలీసు అధికారులకు సూచనలు చేశారు. అనంతరం వీకర్ సెక్షన్ కాలనీలోని రెండు ట్యాంకుల వద్ద ఉన్న స్వర్ణ లక్ష్మీపురం పేట సచివాలయ నామినేషన్ కేంద్రాన్ని సందర్శించారు. హైపర్ సెన్సిటివ్ పోలింగ్ కేంద్రంగా గుర్తించిన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసి భద్రతా చర్యలను సమీక్షించారు. చివరగా వెంకటరమణ కాలనీలోని మున్సిపల్ కార్యాలయాన్ని సందర్శించి నామినేషన్ల దాఖలు ప్రక్రియను పరిశీలించారు. ఎన్నికల నియమ నిబంధనలను పక్కాగా అమలు చేయాలని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై ఎలాంటి మినహాయింపులు లేకుండా కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసు సిబ్బందిని ఎస్పీ ఆదేశించారు. ఈ తనిఖీల్లో కర్నూలు డీఎస్పీ రాఘవేంద్ర, స్పెషల్ బ్రాంచ్ సీఐ మధుసూదన్ రావు, కర్నూలు ఫోర్త్ టౌన్ సీఐ విక్రమసింహ, త్రీ టౌన్ సీఐ శేషయ్య, సంబంధిత ఎస్ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# స్థానిక సంస్థల ఎన్నికల పర్యవేక్షణకు అబ్జర్వర్ల నియామకం

### జనరల్ అబ్జర్వర్‌గా జె. వెంకట మురళి, ఐఏఎస్
### ఎన్నికల వ్యయ పరిశీలకురాలిగా పి. శ్యామల, ఐఎఫ్ఎస్
### సమాచారం, ఫిర్యాదుల కోసం అబ్జర్వర్లను సంప్రదించవచ్చు









నంద్యాల, అక్టోబర్ 18: (మహి న్యూస్): నంద్యాల జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికల పర్యవేక్షణ కోసం జనరల్ అబ్జర్వర్‌గా జె. వెంకట మురళి, ఐఏఎస్, ఎన్నికల వ్యయ పరిశీలకురాలిగా పి. శ్యామల, ఐఎఫ్ఎస్ నియమితులైనట్లు జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి గణియా తెలిపారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలు, ఎన్నికల నిర్వహణకు సంబంధించిన అంశాలను జనరల్ అబ్జర్వర్ పర్యవేక్షిస్తారని కలెక్టర్ పేర్కొన్నారు. అభ్యర్థుల ఎన్నికల ఖర్చులు, నిర్దేశిత వ్యయ పరిమితులు, ఖర్చుల రికార్డుల పరిశీలనను ఎన్నికల వ్యయ పరిశీలకురాలు పర్యవేక్షిస్తారని తెలిపారు. ఎన్నికలకు సంబంధించిన సమాచారం కావాలన్నా, ఫిర్యాదులు చేయాలన్నా ప్రజలు సంబంధిత అబ్జర్వర్లను సంప్రదించవచ్చని కలెక్టర్ సూచించారు. జనరల్ అబ్జర్వర్ జె. వెంకట మురళి: 7815959526 ఎన్నికల వ్యయ పరిశీలకురాలు పి. శ్యామల: 9440810075

# కర్నూలులో పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవ రిహార్సల్స్ ర్యాలీ

### కొండారెడ్డి బురుజు నుంచి జిల్లా పోలీస్ కార్యాలయం వరకు ర్యాలీ
### అక్టోబర్ 21 నుంచి నెలాఖరు వరకు సంస్మరణ కార్యక్రమాలు
### రుల త్యాగాలను స్మరించుకునేందుకు పోలీసు శాఖ ఏర్పాట్లు




కర్నూలు, అక్టోబర్ 18: (మహి న్యూస్): పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా కర్నూలు నగరంలో ఆదివారం పోలీసు సిబ్బంది రిహార్సల్స్ ర్యాలీ నిర్వహించారు. అక్టోబర్ 21 నుంచి నెలాఖరు వరకు నిర్వహించనున్న సంస్మరణ కార్యక్రమాల్లో భాగంగా జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్ ఆదేశాల మేరకు ఈ ర్యాలీ చేపట్టారు. అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) హుస్సేన్ పీరా, ఏఆర్ అడిషనల్ ఎస్పీ కృష్ణమోహన్ పర్యవేక్షణలో కొండారెడ్డి బురుజు వద్ద ర్యాలీ ప్రారంభమైంది. అక్కడి నుంచి కంట్రోల్ రూమ్ మీదుగా జిల్లా పోలీస్ కార్యాలయం వరకు కొనసాగింది. దేశ రక్షణ, శాంతిభద్రతల పరిరక్షణ కోసం విధి నిర్వహణలో ప్రాణాలు అర్పించిన పోలీస్ అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ సంస్మరణ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఈ ర్యాలీలో ఆర్ఐలు నారాయణ, జావేద్, ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు, పోలీసు సిబ్బంది, ట్రైనీ పోలీసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# నంద్యాల జిల్లాలో ప్రశాంతంగా ముగిసిన నామినేషన్ల ప్రక్రియ

### చైర్‌పర్సన్ పదవులకు మొత్తం 88 నామినేషన్లు
### వార్డు మెంబర్ పదవులకు మొత్తం 1,443 నామినేషన్లు
### చివరి రోజు చైర్‌పర్సన్‌కు 53, వార్డు మెంబర్ పదవులకు 889 నామినేషన్లు



నంద్యాల, అక్టోబర్ 18: (మహి న్యూస్): నంద్యాల జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ప్రశాంతంగా ముగిసిందని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి తెలిపారు. అక్టోబర్ 16 నుంచి 18వ తేదీ వరకు మూడు రోజుల పాటు జరిగిన నామినేషన్ల ప్రక్రియలో చైర్‌పర్సన్ పదవులకు మొత్తం 88, వార్డు మెంబర్ పదవులకు 1,443 నామినేషన్లు దాఖలయ్యాయని వెల్లడించారు. ఆదివారం చివరి రోజు చైర్‌పర్సన్ పదవులకు 53 నామినేషన్లు, వార్డు మెంబర్ పదవులకు 889 నామినేషన్లు దాఖలైనట్లు పేర్కొన్నారు. ఎన్నికల సంఘం నిర్దేశించిన మార్గదర్శకాలు, నిబంధనలకు అనుగుణంగా అధికారులు నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను నిర్వహించారని కలెక్టర్ తెలిపారు. తదుపరి ఎన్నికల ప్రక్రియను కూడా పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

EDITOR and PUBLISHER and OWNED BY NEELI RAMASUBBAIAH, PUBLISHED AT # 87/985-V-P-C-29,VIJAYAPURICOLONY, BESIDE KENDRIYA VIDYALAYA SCHOOL, NEAR NADHYAL CHECKPOST, KURNOOL-518001,KURNOOL DIST, A.P PRINTED AT VSAR PRINTERS, KURNOOL-518001.RNI NO : APTEL/26/A3560. Cell 90 59 58 58 98. Email : mahinewsindia@gmail.com, website : https//epaper.mahinewsindia.com

# ఈ నెల 19న పీజీఆర్ఎస్ రద్దు

### ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలుతో నిర్ణయం

### డిసెంబర్ 3 వరకు ప్రతి సోమవారం కార్యక్రమానికి విరామం

కడప, అక్టోబర్ 18 (మహి న్యూస్): జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులోకి వచ్చిన నేపథ్యంలో ఈ నెల 19వ తేదీ సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించాల్సిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్), డైలీ గ్రీవెన్స్ కార్యక్రమాలను రద్దు చేసినట్లు జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అక్టోబర్ 14 నుంచి డిసెంబర్ 3వ తేదీ వరకు ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉంటుందని పేర్కొన్నారు. ఈ కాలంలో ప్రతి సోమవారం నిర్వహించే పీజీఆర్ఎస్ కార్యక్రమాన్ని తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు వెల్లడించారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించి ఫిర్యాదులు, అర్జీలు సమర్పించేందుకు కలెక్టరేట్‌కు రావద్దని కలెక్టర్ సూచించారు.

## స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు పటిష్టమైన ముందస్తు ఏర్పాట్లు చేపట్టాలి



మదనపల్లె, మహి న్యూస్, అక్టోబర్ 18: అన్నమయ్య జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికలను ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా పారదర్శకంగా, ప్రశాంతంగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు అవసరమైన ముందస్తు ఏర్పాట్లను పటిష్టంగా చేపట్టాలని ఎన్నికల సంఘం ద్వారా జనరల్ అబ్జర్వర్‌గా నియమితులైన జి. బాలకృష్ణ పేర్కొన్నారు. ఆదివారం మదనపల్లెలోని జిల్లా కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్, జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లితో జనరల్ అబ్జర్వర్ జి. బాలకృష్ణ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు సంబంధించి చేపట్టాల్సిన చర్యలు, ఎన్నికల సన్నద్ధత, వివిధ శాఖల మధ్య సమన్వయం, ఎన్నికల ప్రక్రియ సజావుగా సాగేందుకు అనుసరించాల్సిన కార్యాచరణ తదితర అంశాలపై వారు చర్చించారు. ఎన్నికల నిర్వహణలో భాగంగా ఎన్నికల సంఘం నిబంధనలు, మార్గదర్శకాలను క్షేత్రస్థాయిలో పక్కాగా అమలు చేయడం, ఎన్నికలకు సంబంధించిన ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయడం, ఎన్నికల విధులకు నియమితులయ్యే సిబ్బందికి అవసరమైన సూచనలు అందించడం వంటి అంశాలపై సమావేశంలో సమీక్షించారు. ఎన్నికల ప్రక్రియలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా, ప్రజలు స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా అవసరమైన చర్యలు చేపట్టాల్సిన ఆవశ్యకతపై చర్చించారు. అదేవిధంగా ఎన్నికల నిర్వహణకు సంబంధించి సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ, తమకు కేటాయించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించేలా కార్యాచరణ రూపొందించుకోవాలన్నారు. ఎన్నికల సంఘం ఆదేశాలకు అనుగుణంగా ఎన్నికల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లను నిరంతరం పర్యవేక్షిస్తూ, ఎన్నికల ప్రక్రియను సజావుగా నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్, ఎస్పీలను ఆయన కోరారు.

## స్థానిక సంస్థల ఎన్నికల పర్యవేక్షణకు అబ్జర్వర్ల నియామకం

### జనరల్ అబ్జర్వర్‌గా జి. బాలకృష్ణ, ఐఏఎస్

మదనపల్లె, మహి న్యూస్, అక్టోబర్ 18:- అన్నమయ్య జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికల పర్యవేక్షణకు జనరల్ అబ్జర్వర్‌గా జి. బాలకృష్ణ, ఐఏఎస్, ఎన్నికల వ్యయ పరిశీలకురాలిగా ఎం. బబిత, ఐఎఫ్ఎస్ నియమితులైనట్లు జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు ఆదివారం జిల్లా కేంద్రం మదనపల్లిలోని కలెక్టరేట్ కు విచ్చేసిన జనరల్ అబ్జర్వర్ జి. బాలకృష్ణ, ఎన్నికల వ్యయ పరిశీలకురాలు ఎం. బబితా లకు జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్, జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ శర్మ, సబ్ కలెక్టర్ చల్లా కళ్యాణి, డిఆర్ఓ వెంకటేష్ సాదరంగా ఆహ్వానం పలికారు. అనంతరం కలెక్టరేట్లోని ఛాంబర్ లో జిల్లా కలెక్టర్, జేసి, సబ్ కలెక్టర్ లతో ఎన్నికల వ్యయ పరిశీలకులు సమావేశమై ఎన్నికల అంశాలపై చర్చించారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాలు, నిబంధనలకు అనుగుణంగా స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా, నిష్పక్షపాతంగా జరిగేలా, ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలు, ఎన్నికల నిర్వహణకు సంబంధించి వివిధ దశల్లో చేపట్టే చర్యలను సమావేశంలో చర్చించారు. అలాగే, ఎన్నికల సందర్భంగా అభ్యర్థులు చేసే వ్యయంపై ఎన్నికల సంఘం నిర్దేశించిన వ్యయ పరిమితులు, నిబంధనల అమలు, ఎన్నికల వ్యయానికి సంబంధించిన రికార్డుల పరిశీలన వంటి అంశాలపై కూడా చర్చించారు. ఎన్నికల నిర్వహణలో సంబంధిత అధికారులు ఎన్నికల పరిశీలకుల వారి సమన్వయంతో పనిచేస్తూ, ఎన్నికల సంఘం మార్గదర్శకాలను కచ్చితంగా అమలు చేయాలని సంబంధిత అధికారులకు జిల్లా కలెక్టర్ సూచించారు.

## డిసెంబర్ 3 వరకు పీజీఆర్ఎస్ కార్యక్రమం తాత్కాలిక నిలిపివేత

మదనపల్లె, మహి న్యూస్, అక్టోబర్ 18:- స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉన్నందున డిసెంబర్ 3వ తేదీ వరకు మదనపల్లె కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమాలను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టరేట్‌లో నిర్వహించే పీజీఆర్ఎస్‌తోపాటు క్షేత్రస్థాయి పీజీఆర్ఎస్ కార్యక్రమాలు కూడా డిసెంబర్ 3వ తేదీ వరకు తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవు

### కడప ఎక్సైజ్ సూపరింటెండెంట్ జె. రమేష్



కడప జిల్లా/సిద్ధవటం, మహి న్యూస్ అక్టోబర్ 18: ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున నిబంధనలకు విరుద్ధంగా మద్యం విక్రయాలు చేపడితే కఠిన చర్యలు తప్పవని కడప ఎక్సైజ్ సూపరింటెండెంట్ జె. రమేష్ హెచ్చరించారు. త్వరలో జరగనున్న పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో మద్యం అక్రమ విక్రయాలు, నిల్వలను అరికట్టేందుకు ఎక్సైజ్ అధికారులు అప్రమత్తమయ్యారు. సిద్ధవటం మండలంలోని మాధవరం-1 గ్రామంలో మద్యం దుకాణాలను ఏఈఎస్ సోమయ్య తో కలిసి తనిఖీ చేసినట్లు ఎక్సైజ్ సూపరింటెండెంట్ జె. రమేష్ తనిఖీ చేశారు.

## కడప మేయర్‌గా మట్లి సువర్ణ విజయం తథ్యం!

### భారీ మెజారిటీతో గెలుపు ఖాయం: ఆఫ్కాఫ్ ఛైర్మన్ యాటగిరి రాంప్రసాద్



కడప, మహి న్యూస్ అక్టోబర్ 18:ఠి కడప నగర మేయర్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న మట్లి సువర్ణ భారీ మెజారిటీతో విజయం సాధించడం తథ్యమని ఫిషర్మెన్ కో-ఆపరేటివ్ సొసైటీస్ ఫెడరేషన్ ఛైర్మన్ యాటగిరి రాంప్రసాద్ ధీమా వ్యక్తం చేశారు. ఆదివారం సువర్ణ నామినేషన్ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన ఈ సందర్భంగా మాట్లాడారు. టీడీపీ సమన్వయకర్త రెడ్డప్పగారి శ్రీనివాసరెడ్డి, కడప ఎమ్మెల్యే రెడ్డప్పగారి మాధవి, కమలాపురం ఎమ్మెల్యే పుత్తా కృష్ణ చైతన్యరెడ్డిల సహకారంతో పాటు కడప నగర ప్రజల ఆశీస్సులు సువర్ణకు అండగా నిలుస్తాయని పేర్కొన్నారు. ఇచ్చిన హామీలను నెరవేరుస్తున్న కూటమి ప్రభుత్వంపై ప్రజలు సంతృప్తిగా ఉన్నారని తెలిపారు. ఎమ్మెల్యే మాధవి, పార్టీ సమన్వయకర్త శ్రీనివాసరెడ్డి చొరవతో కడప నగరంలో అభివృద్ధి పనులు వేగంగా సాగుతున్నాయని చెప్పారు. సువర్ణ మేయర్‌గా ఎన్నికైతే నగర అభివృద్ధి పనులు మరింత వేగవంతమవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. విద్యాధికురాలైన సువర్ణను గెలిపించడం నగర అభివృద్ధికి ఎంతో అవసరమని, ప్రజలు ఏకపక్షంగా ఆమెకు మద్దతు తెలిపి భారీ మెజారిటీతో గెలిపించాలని యాటగిరి రాంప్రసాద్ పిలుపునిచ్చారు.



## ఈ నెల 19న జిల్లా పోలీస్ కార్యాలయంలో పీజీఆర్ఎస్ కార్యక్రమం ఉండదు




కడప, మహి న్యూస్ అక్టోబర్ 18: ప్రభుత్వ సెలవు దినం నేపథ్యంలో ఈ నెల 19వ తేదీ సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించాల్సిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమం నిర్వహించడం లేదని జిల్లా ఎస్పీ శ్రీ షెల్కే నచికేత్ విశ్వనాథ్, ఐ.పి.ఎస్. గారు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని జిల్లా ఎస్పీ గారు సూచించారు.

## ఎన్నికల కవరేజ్ చేస్తున్న జర్నలిస్టులకు రక్షణ కల్పించాలి

### రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి తక్షణ చర్యలు తీసుకోవాలి

### జర్నలిస్టులపై దాడులను ఖండించిన

### ఏపీ జర్నలిస్ట్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి అల్లం రంగనాయకులు రాయల్



కడప, మహి న్యూస్ అక్టోబర్ 18:ఠి రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల వార్తా సేకరణలో పాల్గొంటున్న జర్నలిస్టుల రక్షణకు రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి తగిన చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ జర్నలిస్ట్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి అల్లం రంగనాయకులు రాయల్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన కడపలో ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అధికార, ప్రతిపక్ష పార్టీల నాయకులు, కార్యకర్తల మధ్య ఆధిపత్య పోరు కారణంగా పరస్పర దాడులు జరుగుతున్నాయని, ఈ పరిణామాలు జర్నలిస్టులపై దాడులకు దారితీస్తుండటం ఆందోళనకరమని పేర్కొన్నారు. కడప జిల్లాలోని బద్వేల్‌లో మహా టీవీ విలేకరి వెంకటేశ్వర్లుపై, పులివెందుల నియోజకవర్గంలో 6 టీవీ విలేకరి చిన్న నరసింహులు, 10 టీవీ విలేకరి రాజులపై జరిగిన దాడులను ఆయన తీవ్రంగా ఖండించారు. ఈ ఘటనలకు బాధ్యులైన వారిని గుర్తించి, వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎన్నికల విధుల్లో భాగంగా వార్తా సేకరణ చేస్తున్న జర్నలిస్టులకు ఎలాంటి ఆటంకాలు లేకుండా రక్షణ కల్పించాలని, ఇందుకోసం పోలీసులకు ప్రత్యేక ఆదేశాలు జారీ చేయాలని కోరారు. కొన్ని ప్రాంతాల్లో పోలీసులే విలేకరులపై దాడులకు పాల్పడుతున్నారన్న ఆరోపణలు మరింత ఆందోళన కలిగిస్తున్నాయని తెలిపారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి తగిన చర్యలు తీసుకోవాలని, ఆయా జిల్లాల పోలీసు ఉన్నతాధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసి జర్నలిస్టుల భద్రతకు భరోసా కల్పించాలని అల్లం రంగనాయకులు రాయల్ విజ్ఞప్తి చేశారు.

## కోల్‌కతా తొక్కిసలాట - సీఎం సువేందు ఉన్నత స్థాయి సమీక్ష



కోల్‌కతా: కోల్‌కతాలోని చోర్‌బాగన్ దుర్గాపూజా మండపం వద్ద జరిగిన తొక్కిసలాటలో 19 మంది మరణించగా, 25 మంది గాయపడిన ఘటనపై పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి సువేందు అధికారి భవానీ భవన్‌లో ఉన్నతాధికారులతో ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి , హోం కార్యదర్శి, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్‌తో పాటు వివిధ శాఖల ప్రతినిధులు హాజరయ్యారు. అంతకుముందు, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, ముఖ్యమంత్రి సువేందు అధికారితో కలిసి కోల్‌కతాలోని అపోలో ఆస్పత్రికి వెళ్లి చికిత్స పొందుతున్న బాధితులను పరామర్శించారు. ప్రమాదం జరిగిన వెంటనే పరిస్థితిని సమీక్షించేందుకు ముఖ్యమంత్రి కలకత్తా మెడికల్ కాలేజ్ ఆస్పత్రికి చేరుకున్నారు. ఈ తొక్కిసలాటకు సంబంధించి చోర్‌బాగన్ దుర్గాపూజ కమిటీ నిర్వాహకులతో సహా ఏడుగురిని కోల్‌కతా పోలీసులు అరెస్టు చేశారు. గిరీష్ పార్క్ పోలీస్ స్టేషన్‌లో భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్) సెక్షన్లు 105, 110, 3(5) కింద సుమోటో కేసు నమోదైంది. విచారణ కోసం తొలుత 14 మందిని అదుపులోకి తీసుకున్నారు. సంఘటనా స్థలంలో ఉన్న ఏసీపీ ప్రాథమిక సమాచారం ప్రకారం, ఒక ప్రైవేట్ సెక్యూరిటీ ఏజెన్సీ చేసిన అనౌన్స్‌మెంట్, ఈలలు వేయడం వల్లే ఈ తొక్కిసలాట మొదలైందని ముఖ్యమంత్రి అధికారి మీడియాకు తెలిపారు. పూజా కమిటీ సభ్యులు, భద్రతా ఏజెన్సీ ప్రతినిధులను అదుపులోకి తీసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. బాధితుల కుటుంబాలకు అన్ని విధాలా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. మృతుల కుటుంబాలకు రూ. 25 లక్షల పరిహారంతో పాటు కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. ఘటన తర్వాత పోలీసులు చోర్‌బాగన్ పండాల్‌లోకి సందర్శకుల ప్రవేశాన్ని నిలిపివేశారు. శాంతిభద్రతల దృష్ట్యా అక్టోబర్ 18 నుంచి 20 వరకు నగరంలోని కొన్ని ప్రాంతాల్లో భారతీయ నాగరిక్ సురక్ష సంహిత సెక్షన్ 163 కింద నిషేధాజ్ఞలు విధించారు. ముందుజాగ్రత్త చర్యగా సురుచి సంఘ, చేత్లా అగ్రణి, తాలా ప్రత్యయ్ వంటి ప్రముఖ పూజా పండాల్‌లను కూడా మూసివేశారు.

### 'అధికారుల నిర్లక్ష్యమే కారణం'

ఈ ఘటనలో మరణించిన 26 ఏళ్ల నర్స్ శ్రీపర్ణ పొద్దార్ కుటుంబ సభ్యులు అధికారుల నిర్లక్ష్యమే ప్రమాదానికి కారణమని ఆరోపించారు. మెరుగైన ఏర్పాట్లు చేసి ఉంటే ఈ ఘోరాన్ని నివారించవచ్చని మృతురాలి సోదరి రీపా దాస్ అన్నారు. కాగా ప్రభుత్వం బాధిత కుటుంబాలకు రూ. 25 లక్షల పరిహారం, ప్రభుత్వ ఉద్యోగం, అలాగే గాయపడిన వారికి రూ. 5 లక్షల సాయం ప్రకటించింది. మరోవైపు శనివారం సాయంత్రం చోర్‌బాగన్ మండపం వద్ద మృతి చెందిన 19 మంది పేర్లు, వయస్సు, చిరునామాలతో కూడిన పూర్తి జాబితాను పోలీసులు అధికారికంగా విడుదల చేశారు.కాగా కోల్‌కతా ఘటన దరిమిలా ఉత్తరప్రదేశ్ అంతటా ఉన్న పూజా మండపాల్లో ఫైర్ సేఫ్టీ, ఎంట్రీ-ఎగ్జిట్ పాయింట్లు, ఎమర్జెన్సీ దారులు, విద్యుత్ వ్యవస్థలపై క్షేత్రస్థాయి పరిశీలనలు జరపాలని యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ అధికారులను ఆదేశించారు.

# అఫ్గాన్ బాలికలపై తాలిబన్ల పంజా




కాబూల్: అఫ్గాన్‌లో తాలిబన్లు అధికారం చేపట్టిన నాటి నుంచి మహిళలపై జరుగుతున్న ఆగడాల గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. బాలికలతో పాటు మహిళలపై ఎన్నో కఠిన చట్టాలు తీసుకవచ్చి వారి మానవహక్కుల్ని తాలిబన్లు కాలరాస్తున్నారు. ఈ నేపథ్యంలో ఇప్పుడు ఐక్యరాజ్యసమితి బాలల సంక్షేమ సంస్థ యునిసెఫ్ విడుదల చేసిన నివేదిక ఇప్పుడు ఆందోళన కలిగిస్తోంది. 2021లో తాలిబన్లు అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటివరకు 26 లక్షల మందికి పైగా బాలికలు మాధ్యమిక విద్యకు దూరమయ్యారని ఐక్యరాజ్యసమితి బాలల సంక్షేమ సంస్థ యునిసెఫ్ వెల్లడించింది. ఐదేళ్లుగా తరగతి గదులకు దూరమైన బాలికలు విద్యతో పాటు మెరుగైన జీవితాన్ని నిర్మించుకునే అవకాశాలను కూడా కోల్పోతున్నారని ఆందోళన వ్యక్తం చేసింది. అఫ్ఘనిస్థాన్‌లో 2021 సెప్టెంబర్ నుంచి బాలికలు ఆరో తరగతి తర్వాత చదువుకోవడంపై నిషేధం అమల్లో ఉంది. 2022 డిసెంబర్ నుంచి మహిళలు విశ్వ విద్యాలయాల్లో ప్రవేశించడంపైనా ఆంక్షలు విధించారు. దీంతో బాలికలకు మాధ్యమిక, ఉన్నత విద్యా అవకాశాలు దాదాపుగా మూసుకుపోయాయి. ప్రపంచంలో బాలికలు, మహిళలకు ఈ స్థాయిలో విద్యను నిరాకరిస్తున్న ఏకైక దేశంగా అఫ్ఘనిస్థాన్ కొనసాగుతోందని యునిసెఫ్ పేర్కొంది. చదువుకు దూరం కావడంతో బాలికలు బాల్యవివాహాలు, బాలకార్మిక వ్యవస్థ, వేధింపులు, దోపిడీ, లింగ ఆధారిత హింస వంటి ప్రమాదాలను ఎదుర్కొనే అవకాశాలు పెరుగుతున్నాయని యునిసెఫ్ హెచ్చరించింది. ముఖ్యంగా పేదరికం, నిరాశ్రయత్వం వంటి పరిస్థితులు ఈ ముప్పులను మరింత తీవ్రం చేస్తున్నాయని తెలిపింది. పాఠశాల అనేది కేవలం విద్యను అందించే కేంద్రం మాత్రమే కాదని, బాలికలకు రక్షణ కల్పించే కీలక వ్యవస్థ అని స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో యునిసెఫ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కేథరిన్ రస్సెల్ మాట్లాడుతూ.. ఐదేళ్లు ఒక దేశ చరిత్రలో తక్కువ సమయమే అయినప్పటికీ, ఒక బాలిక జీవితంలో అది అత్యంత కీలకమైన దశ అని పేర్కొన్నారు. తరగతి గది బాలికలకు జ్ఞానాన్ని అందించడమే కాకుండా, తమ అభిప్రాయాలను వ్యక్తం చేసే స్వేచ్ఛను, జీవితంలో ఎదిగే అవకాశాన్ని కల్పిస్తుందని తెలిపారు. పాఠశాలలు మూతపడటంతో బాలికలు విద్యతో పాటు బాల్యవివాహాలు, హింస, దోపిడీ నుంచి రక్షణ పొందే అవకాశాలను కూడా కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బాలికల విద్యపై ఆంక్షలు అఫ్ఘనిస్థాన్ ఆర్థిక వ్యవస్థపైనా తీవ్ర ప్రభావం చూపుతున్నాయని యునిసెఫ్ వెల్లడించింది. 2030 నాటికి దేశం సుమారు 20 వేల మంది మహిళా ఉపాధ్యాయులను, 5,400 మంది మహిళా ఆరోగ్య కార్యకర్తలను కోల్పోయే ప్రమాదం ఉందని 2026 ఏప్రిల్‌లో విడుదల చేసిన విశ్లేషణలో అంచనా వేసింది. ప్రాథమిక విద్యలో మహిళా ఉపాధ్యాయుల సంఖ్య 2022లో దాదాపు 73 వేలుగా ఉండగా, 2024 నాటికి 66 వేలకు పడిపోయింది. ప్రభుత్వ ఉద్యోగాల్లోనూ మహిళల ప్రాతినిధ్యం తగ్గుముఖం పట్టింది. మహిళల విద్య, ఉపాధిపై ఆంక్షల కారణంగా అఫ్ఘనిస్థాన్ ఏటా సుమారు 8.4 కోట్ల అమెరికన్ డాలర్ల ఆర్థిక ఉత్పత్తిని కోల్పోతోందని యునిసెఫ్ అంచనా వేసింది. ఆంక్షలు కొనసాగినకొద్దీ ఈ నష్టాలు మరింత పెరిగే ప్రమాదం ఉందని హెచ్చరించింది. మహిళలకు విద్య, ఉపాధి అవకాశాలు తగ్గిపోవడం దేశ అభివృద్ధిని దీర్ఘకాలంలో దెబ్బతీస్తుందని విశ్లేషించింది. ఈ ఆంక్షల ప్రభావం భవిష్యత్తు తరాలపైనా పడే అవకాశం ఉందని యునిసెఫ్ తెలిపింది. విద్యకు దూరమైన మహిళలు తల్లులైనప్పుడు వారి పిల్లల్లో తక్కువ బరువుతో జన్మించడం, టీకాలు పూర్తిస్థాయిలో అందకపోవడం, ఎదుగుదల మందగించడం వంటి సమస్యల ముప్పు పెరగవచ్చని వివరించింది. ఇప్పటికే ఒత్తిడిలో ఉన్న అఫ్ఘనిస్థాన్ ఆరోగ్య వ్యవస్థపై ఇది మరింత భారాన్ని మోపవచ్చని హెచ్చరించింది. 2023 నుంచి ఇరాన్, పాకిస్థాన్ నుంచి 27 లక్షల మందికి పైగా అఫ్ఘనిస్థాన్‌కు తిరిగి రాగా, వారిలో 60 శాతం మంది పిల్లలు, యువతేనని నివేదిక పేర్కొంది. విద్య అనేది బాలికల హక్కు మాత్రమే కాదు.. వారి ఆత్మగౌరవానికి, స్వావలంబనకు, భద్రమైన భవిష్యత్తుకు పునాది. అఫ్ఘన్ బాలికలకు విద్యా ద్వారాలు మూసుకుపోవడం వారి జీవితాలనే కాకుండా దేశ ఆర్థిక ప్రగతిని, రాబోయే తరాల ఆరోగ్యాన్ని సైతం ప్రభావితం చేసే ప్రమాదం ఉందని యునిసెఫ్ హెచ్చరిక స్పష్టం చేస్తోంది.

# సర్వీస్ రికార్డు.. ఇక డిజిటలైజేషన్

### పోస్టులో చేరిక మొదలు... పదవీ విరమణ వరకు వివరాలు ఆన్‌లైన్‌లో

### బదిలీలు, పదోన్నతులు, సెలవులు, ఇతరాలన్నీ కంప్యూటరీకరణ

### అన్ని ప్రభుత్వ శాఖల్లో ఈ-హెచ్ఆర్ఎంఎస్ అమలుకు ఉత్తర్వులు

### మాన్యువల్ పద్ధతిలోని సేవా వ్యవహారాల్లో జాప్యానికి చెక్



హైదరాబాద్: ప్రభుత్వ ఉద్యోగుల సర్వీస్ రికార్డును డిజిటలైజేషన్ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. సర్వీసు రికార్డుల నమోదులో జాప్యానికి చెక్ పెట్టేందుకు ఆన్‌లైన్ విధానాన్ని అమలు చేసేందుకు ఉపక్రమించింది. ఉద్యోగిగా చేరిక మొదలు, సెలవులు, ఇంక్రిమెంట్లు, బదిలీలు, పదోన్నతులు, విధి నిర్వహణలో పొరపాట్లు, చట్టపరమైన చర్యలు, కేసులు, పదవీ విరమణ ఇలా అన్నింటినీ డిజిటల్ విధానంలోకి తీసుకురానుంది. తెలంగాణ ఇంటిగ్రేటెడ్ ఫైనాన్స్ మేనేజ్‌మెంట్ అండ్ ఇన్ఫర్మేషన్ సిస్టం(టీఐఎఫ్ఎంఐఎస్)లో భాగమైన ఎలక్ట్రానిక్ మానవ వనరుల నిర్వహణ వ్యవస్థ (ఈ--హెచ్ఆర్ఎంఎస్)ను అన్ని ప్రభుత్వ శాఖల్లో అమలు చేయనుంది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్‌జాజు శనివారం జీవో 141 జారీ చేశారు. ప్రస్తుతం ఉద్యోగుల సర్వీస్ రికార్డులన్నీ మాన్యువల్ పద్ధతిలోనే నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో వివిధ సేవా సంబంధిత వ్యవహారాల పరిష్కారంలో జాప్యం జరుగుతోంది. ఏళ్లకుఏళ్లుగా సమాచారాన్ని అందులో ఎంట్రీ చేయడం లేదు. పదోన్నతులు, బదిలీల సమయంలో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. పెండింగ్ వ్యవహారాలపై సమగ్ర పర్యవేక్షణ కూడా కొరవడుతోంది. ఈ సమస్యలకు పరిష్కారంగా అన్ని శాఖలకు ఒకే విధమైన సమీకృత డిజిటల్ వ్యవస్థను అందుబాటులోకి తెస్తోంది.

### ప్రతి ఉద్యోగికి డిజిటల్ సర్వీస్ రిజిస్టర్

ఈ--హెచ్ఆర్ఎంఎస్ ద్వారా ప్రతి ప్రభుత్వ ఉద్యోగికి ధ్రువీకరించిన డిజిటల్ సర్వీస్ రిజిస్టర్ నిర్వహిస్తారు. ఆయా అంశాలకు సంబంధించిన మాడ్యూళ్లు అందుబాటులోకి వచ్?చన మేరకు దరఖాస్తుల నమోదు, పరిశీలన, ఆమోదం, పరిష్కారం.. అన్నీ ఆన్‌లైన్ విధానంలోనే సాగుతాయి. దీంతో ఏ ఉద్యోగికి సంబంధించిన వ్యవహారం ఏ దశలో ఉందో తెలుసుకోవడంతోపాటు, పెండింగ్ కేసులను గుర్తించి వాటి పరిష్కారాన్ని పర్యవేక్షించే అవకాశం ఉంటుంది. అలాగే, పరిపాలనలో పారదర్శకత, జవాబుదారీతనం పెరుగుతాయని ప్రభుత్వం భావిస్తోంది.

### అధికారులదే డేటా బాధ్యత

సచివాలయ శాఖలు, శాఖాధిపతుల కార్యాలయాలు, జిల్లా కార్యాలయాలు, డివిజినల్, కింది స్థాయి ప్రభుత్వ కార్యాలయాలన్నింటిలో ఈ విధానాన్ని అమలు చేయాలని ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు. ఉద్యోగుల వివరాలను పూర్తిగా, ప్రామాణికంగా నమోదు చేసే బాధ్యత సంబంధిత పరిపాలనా శాఖలు, శాఖాధిపతులు, డ్రాయింగ్ అండ్ డిస్బర్సింగ్ అధికారుల(డీడీఓ)పై ఉంటుంది. అమలును వేగవంతం చేయడంతోపాటు, తమ పరిధిలోని కార్యాలయాల్లో ఈ విధానాన్ని పర్యవేక్షించాలని శాఖాధిపతులను ఆదేశించింది. జిల్లాల వారీగా ట్రెజరీ, పే అండ్ అకౌంట్స్ కార్యాలయాల నోడల్ అధికారులను నియమించారు. జిల్లాస్థాయిలో పరిష్కారం కాని సమస్యలను ఐఎఫ్ఎంఐఎస్ సహాయ కేంద్రం 7042420033 నంబర్‌కు తెలియజేయొచ్చు. ఈ ప్రక్రియ అమలును ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి సిక్తా పట్న?నయక్ పర్యవేక్షిస్తారు. డిజిటల్ విధానం అమలు చేస్తున్నప్పటికీ ఇప్పటికే ఉన్న సర్వీస్ నిబంధనలు, అధికారుల పరిధులు, అప్పగించిన అధికారాల్లో ఎలాంటి మార్పు ఉండదని ప్రభుత్వం స్పష్టం చేసింది.

EDITOR and PUBLISHER and OWNED BY NEELI RAMASUBBAIAH, PUBLISHED AT #1/704, PARK STREET, NEAR OLD BUSTAND, JAMMALAMADUGU-516434,YSR KADAPADIST, A.PPRINTED AT VSAR PRINTERS, YSR KADAPA DIST, 516004. RNI NO : APTEL/25/A0108. Cell 90 59 58 58 98. Email : mahinewsindia@gmail.com, website : https//epaper.mahinewsindia.com